# చిత్రగ్రంధి




స్వాతి

# చిత్రగ్రంథి

ఇస్మాయిల్

కవిత్వం

సఖీకుమారి ప్రచురణలు
జి.12, సాదత్ టవర్స్
పద్మావతి అపార్ట్‌మెంట్స్
సలీంనగర్ కాలనీ, మలకపేట
హైదరాబాదు - 500036

# CHITRA GRANTHI

(Poetry in Telugu)

By

**SUDHAMA**
9849297958
sudhama60@yahoo.com

**25th November' 2011**

Copies : 1000

PRICE : Rs. 100/-

Cover Design
**Snehith Allamraju**

DTP & Layout
**NIRMALA**
9885729723

Printed at
**OM SAI GRAPHICS**
(multicolour offset printers)
3-4-709, Narayanaguda,
Hyderabad - 27.

For Copies
**© Sakhi Kumari Prachuranalu**
**Smt. A. Usharani,**
G.12, Sadath Towers,
Padmavathi Apartments
Saleemnagar Colony, Malakpet,
**HYDERABAD. 500 036 (A.P.)**
Res. 040-24545780 * Cell: 9848276929

And also at
Visalandhra Book House,
Navodaya Book House,
Palapitta Books, Hyderabad

కవిత్వం ఇష్టపడే

స్నేహితు(ల)కు

ప్రేమగా —

# సాగుతూ ....

చాలా కాలంగా కవిత్వం రాస్తున్నా, పత్రికల్లో, కేంద్ర సాహిత్య అకాడమీ వంటి పలు సంస్థల సంకలనాల్లో నా కవితలు చోటు చేసుకున్నా, మిత్రుడు నాగినేని భాస్కరరావుతో కలిసి 1974లో 'మేం' కవితాసంకలనం వెలువరించినా, ఆపై నాదంటూ ఓ కవితా సంకలనం మాత్రం 1990లో 'అగ్నిసుధ'గా ప్రచురించాను. 'అగ్నిసుధ'కు 1991లో ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు, కలహంసి అవార్డు లభించాయి. 1983లోనే ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనానికి తెలుగుకవిగా ఎంపికయ్యాను. వంశీ ఇంటర్నేషనల్, జ్యోత్స్నా కళాపీఠం, హిందీమిలాప్ దినపత్రిక–శంకర్ మెమోరియల్ ట్రస్టు వంటి పలు సంస్థలు నన్ను కవిగా సత్కరించాయి. ఆచార్య తిరుమల స్మారక సాహితీ పురస్కారం కవిగా అందుకున్నాను.

నేను వివిధ సాహిత్య ప్రక్రియలలో కృషి చేస్తూ కార్టూనిస్టుగా, రచయితగా, సమీక్షకునిగా, విమర్శకునిగా, కాలమిస్టుగా, పజిల్స్ నిర్మాతగా, వక్తగా కూడా గుర్తించబడినా మౌలికంగా కవిని. కవిత్వమే నా స్ఫూర్తి, దీప్తి. ఈ 'చిత్రగ్రంథి' నా ముద్రిత గ్రంథాలలో నాల్గవది. కవితా సంపుటిగా రెండవది. గత సంవత్సరం 'మనసు పావనగంగ' పేరిట నా పాటల పుస్తకం వెలువరించాను. 'అగ్నిసుధ' కవితా సంపుటి 1990లో వెలువరించాక గత ఇరవై ఏళ్లలో నేను రాసిన కవిత్వం, మిగితా నా ప్రక్రియా రచనలతో పోలిస్తే రాశిలో తక్కువే. కాని ఆంధ్రప్రభ దినపత్రికలో 2007 నవంబర్ నుండి రెండేళ్లకు పైగా వారంవారం గురువారాల్లో కవిత్వ రూపంలోనే, 'కవి కాలమ్' నిర్వహించి ఎందరి ప్రశంసలో అందుకున్నాను. అలాగే కవిసమ్మేళనాలకని రాసిన కొన్ని తప్ప, నా కవితలు అముద్రితాలంటూ ఏవీ లేవు. గత ఇరవై ఏళ్లలో రాసిన వాటిల్లో అరవై ఒక్క కవితలను, నా జీవితంలో అరవైఒకటో ఏడులోకి అడుగుపెడుతున్న సందర్భంగా, ఇలా 'చిత్రగ్రంథి'గా మీ ముందుంచుతున్నాను. ఈ కవిత్వం మీకు నచ్చుతుందని ఆశ. మీ 'ముందు' మాటలే కవిగా నా నిరంతర ప్రస్థాన బాటలని నమ్మకం..

25.11.2011
హైదరాబాదు - 36.

సదా మీ
సుధామ
9849297958

# వరుస....

కవి(త) ప్రవేశం - 11
బూజుకర్ర - 12
రక్ష - 15
చమురుగుండె సెగ - 17
వెతుకుతూనే వుంటారు - 19
బిలం కాంతి బలం - 21
చలి - 24
కాంచన కాలోపద్రవం - 26
అంటున్నా - 28
చిత్రగ్రంథి - 30
బిందుచేతన - 33
స్వగతం-స్వాగతం - 35
కలగా...కలగా పులగంగా...- 36
రాజకీయ కార్ట్యూన్ - 39
ఉన్నంతలో ఉడుతలవ్వండి - 41
స్నేహం - 43
బాధాపుష్పం - 45
జీవితేచ్ఛ - 48
అగ్నినగ్నీకరం - 50
భూమి కోసం - 52
కొత్తపల్లవి - 55
ఒక పక్షి కోసం - 57
కౌతుకం - 60
కృత్యాదిగా - 62
ఓదార్పు - 64
అమావాస్య తిమిరావళి - 66
కొత్తపువ్వులు శ్వాసిస్తాయి - 68
వివరణం - 70
గణతంత్రం - 72
రాత్రి నిద్ర - 74

ఇచ్చుట మాత్రము... - 76
జలప్రయాణం - 78
సంకల్ప స్పందనం - 80
గేమ్స్ ఆడకు నువ్వు - 83
వరదాక్షరం - 85
ఎగాదిగా ఉగాది - 88
హృదయం - 90
ఆమె(రి)కా పూలు - 92
సమర సమీరంలో - 94
'నరా'వతారం - 97
జలావరణం - 99
స్మర వారం వారం - 102
దేవుడు దేవుడే - 104
ఉన్నది జాగ్రత్త - 106
సరేలే! ఇంకొంచెం చిల్లు.. - 109
మౌనమే నీ చప్పుడు - 111
నీటి పంజరం - 114
విలువ - 116
శ్రమ యజ్ఞంలో... - 117
చెలామణి - 119
అంతా వాళ్లేచూసుకుంటారు-120
అమరిక - 124
సరసా విరసా తుసాభుసా - 127
ఎంత ఎంత ఎడమైతే - 130
చివరి జాప్యం - 131
చావుబేరం - 133
చేతులు కురిసిన చేతన - 135
అన్వేషణ - 137
వీక్షణ విహంగం - 141
కవిత్వం నా రావణకాష్ఠం - 142
మలిగిన దీపం వెలుగు - 145

# కవి(త) ప్రవేశం

నేను
ఎదురు చూస్తున్నాను –
తలుపుతట్టి
ఇంట్లోకి వచ్చాడు ఆ కవి.

నేను
ఊహించనేలేదు –
మనసుతట్టి
హృదయంలోకి వచ్చాడు ఈ కవి.

ద్వారం దగ్గరే
వీడ్కోలు పలికాను గానీ ఆ కవికి,
ఏ దారినీ పోనీయక
నిలుపుకోవడమెలాగా అని
ఆరాటపడ్డాను ఈ కవికి.
అతను పేరున్న కవి.
ఇతడు కవితగా
వచ్చిన కవి.

*

('పత్రిక' మాస పత్రిక, ఫిబ్రవరి 2006.)

# బూజుకర్ర

ఒక బూజు కర్ర కావాలి
అప్పుడు రాజుని దులిపిన అగ్నిధారా సదృశ
కవికంఠ గత అగ్నివీణ మ్రోగాలి
ఈ బూజును పీచు మిఠాయిగా నమ్మిస్తున్న
అవివేకాన్ని దులపడానికైనా
నాకు చైతన్య హస్తం కావాలి.

మొండి గోడలే కాదు మొండి చేతులూ చూసి చూసి
ఈ తొండి ఆటకు విసుగెత్తిపోయాను
ఒకరు మీద ఒకరు ఎందరొచ్చినా
గదులు శుభ్రం చేసినవారెవరూ లేరు
ఎవరికివారు తమ కుర్చీ తమ బల్లా చూసుకున్నారేగానీ
గదిని వాసయోగ్యంగా మొత్తంగా మలచనే లేదు.

పని మనిషి రాలేదు ఎవరూ
తట్టెడు అంట్లు అలానేవున్నాయి
గదులూడ్చి ఎన్నాళ్ళయిందో
అద్దం నిండా మరకలే
తమాషా ఏమిటంటే ఇల్లు నాదే కానీ
ఇల్లాలూ మాట వినదు
సొంత ఇల్లే అద్దె కొంపలా మారింది.

అతిథులు వస్తున్నారు పోతున్నారు
గేహంలో దేహంతో విశ్రమిస్తున్నారు
సందేహాలు మాత్రం అలానే వున్నాయి
భోంచేసినవాడు వాసాలు లెక్కిస్తున్నాడు గానీ
పట్టిన బూజు దులిపేందుకెవడూ
సమకట్టడం లేదు.

ఔనౌను! అన్నట్లు
ఇల్లువూడ్చే యంత్రం ఒకటుంది
అది నడిచే యంత్రాంగమూ పేరుకు వుంది
విద్యుత్తు లేనప్పుడూ
నడిపించగల విద్వత్తు లేనప్పుడూ
పరిశుభ్రత ఎలా సాధ్యం
గొట్టాలలోని గాలి వూదేదో
లోలోపలికి దుమ్మును పీల్చేదో
ద్విధాప్రయుక్తమైన దశలో
అసలు యంత్రాన్ని పనిచేయించి
దానికైనా చేతితోనే
బూజులు పట్టిన మూలమూలల్లోకి
సారింపజేయాలి కదా!

అసలు బూజు ఎక్కడుంది
అంతా నీ భ్రమ అంటాడొకడు
గది నేల చూడు ఎంత అద్దంలా మెరుస్తోందో అంటాడొకడు
గోడకు వ్రేలాడుతున్న వర్ణచిత్రాలు చూడమంటాడొకడు
అంతా బానే వుంది అంటే
నా గదిలోనే నాకు శ్వాస ఎందుకు ఆడడం లేదు
దుమ్మూ, బూజులూ వల్ల కాకపోతే
నాకీ దమ్మురోగం ఎందుకొచ్చినట్లు
దమ్మున్నవాడిని కాబట్టే
బూజు దులపాలంటున్నాను.

యంత్రం వున్నా పవర్‌కట్ అయినప్పుడు
వాక్యూం క్లీనర్లు కాదు
చేత చీపురుకట్టే నయం నేలవూడ్చేందుకు
పొడుగాటి బూజుకర్రేనయం
గది పైపై మూలలన్నీ కూడా శుభ్రపరిచేందుకు

ఒక్కొక్క వాక్యమూ
ఒక్కో ఈనె లాగా
నా నిటారుతనమే ఒక గడకర్రలాగా
ఎవరికోసమో ఎదురుచూడడం కాదు
నా గదిని నేనే శుభ్రపరుచుకుంటా
తప్పదు
అంతరాల తరతరాల బూజు దులపడానికి
నేనే బూజుకర్రనవుతా

నా గదికే కాదు, వ్యవస్థాగత
పర్యావరణ పరిశుభ్రతకే పనిముట్టుగా మారుతా.

*

(22.7.2011 - దాశరథి స్మృతిగా కేంద్ర సాహిత్యఅకాడమీ కవిసమ్మేళనం, రవీంద్రభారతి, హైదరాబాద్.)

# రక్ష

బావిని చూసి –
ఎంత పెద్ద మినరల్ వాటర్ బాటిలో
అని నివ్వెరపోవడం నుంచి,
దారికిరుప్రక్కలా
చెట్లను చూసి
ఈ తరహా డిజైన్
ఆక్సిజన్ సిలిండర్లు
ఎంత బావున్నాయో కదా
అని ముక్కున వేలేసుకోవడం నుంచి,

సెల్‌ఫోన్
రింగ్‌టోన్‌గా
కోకిల గొంతు విని –
ఈ కంపోజిషన్ ఏదో భలేగా వుందే
అని ముచ్చట పోవడం నుంచి,

అచ్చు పుస్తకాన్ని చూసి –
కంప్యూటర్ ఫైలు నంతా
ఇలా ప్రింటవుట్‌లు తీయడమేమిటి
ఔట్‌డేటెడ్‌గా
అని విసుక్కోవడం నుంచి

భావితరాన్ని రక్షించుకోవడం అంటే –
ఇవాళ
పర్యావరణాన్ని పరిరక్షించుకోవడమే!

నీటిని, గాలిని, ధ్వనిని
క్షరముకాని అక్షరంగా సహజసిద్ధంగా
స్వచ్ఛంగా నిలుపుకుంటే చాలు –
మహిని, మనిషిని కూడా రక్షించుకున్నట్లే.

✻

('నేటినిజం' జూన్ 2007 (పర్యావరణ పరిరక్షణ ప్రత్యేక అనుబంధం))

# చమురు గుండె సెగ

‘ఎడారి ఇసుక శిబిరంలో ప్రాణదాహం
జిల్లార్చుకు అల్లాడే ‘అలాన్’ కన్నీళ్ళ కల్లోలం
దొలుచుకు వస్తున్న అంతరాంతర అంతిమ ఘంటాకుహరం
గుక్కెడు నీళ్ళ కోసం, ఓ రొట్టె తునక కోసం
ఆహార అన్వేషణలో శిబిర రేఖలు అతిక్రమించినందుకు
చితకబాదే రక్షక లాఠీల భయోత్పాతం
నవీన నాగరీకం హఠాత్తుగా బ్రద్దలై జారి
పునర్జీవించిన శతాబ్దాల క్రితపు ఆటవిక స్వరూపం

‘ఖబూస్’ ముక్క కోసమో
మినరల్ నీటి సీసా కోసమో
రాతియుగం ఆదితెగల నాయకుల్లా తెగ పోరే
నరమాంస భక్షక పైశాచికం
నిస్సహాయ దౌర్భాగ్యం తప్ప పెదవులకు పాలస్పర్శలేని
పసికందు మృత్యుకందుకం
సూర్యాతపతీక్షణతతో సొమ్మసిల్లే నిండు నెలల గర్భం
కళ్ళ పైకి దండెత్తే ఇసుక దుమారం
ఎడారిలో ఇసుకలో శరీరాలను ఈడ్చుకుంటూ
వెనక్కి పోలేని, ముందుకు రాలేని
అతలాకుతల మానవ ప్రవాహం
ఆహారం మంచినీరు మందులే కాదు
సానుభూతి కూడా సరఫరా కాని శాపగ్రస్తులు
మధ్య ప్రాచ్య సంక్షోభంలో మాడి మసవుతున్న
మిడతల దండు శరణార్థులు

ఒకనాడు
దూరపు డబ్బుకొండల నునుపులు
చెక్కిళ్ళకు రాసుకుందామని, హోదాల గోదాములు కట్టి
సంపత్తి వారసత్వం చమురు దేశంలో
ధనం పంటలు పండించుకుందామని
'వైట్'లో లేనిది ఏ కువైట్ పెట్టుబడుల్లోనో పెట్టి
సువర్ణభవన సుందర కక్ష్యలో హంసతూలికాతల్ప
సుఖశయనం విలాసవంతం కావించుకుందామని
పరుగులు తీసినప్పుడు,
కన్నతల్లి కన్నీళ్ళనూ, అయినవారి ఆపేక్షల్నీ
నిర్దాక్షిణ్యంగా నిరాకరించి
కాళ్ల కింద నిప్పులు పోసినట్టు ఎడారి ఎండమావుల వెంట
ఇరాక్ ఇరుకుల్లోకి పరుగిడి చొరబడినప్పుడు
ఇథియోపియా ఘోర దుర్భిక్షాన్ని మించిన మహా విషాదం
జోర్డాన్ తీరాన నేడివాళ అంతమేలేని పీడకలలా చుట్టుముట్టి
తమ జీవసారాన్నే చమురు బొట్టులా పిండుతుందని
క్షణమైనా తలపోశారా?
చేతులే కాదు పట్టుకోడానికి ఆకులూ కాలుతున్నాయి నేడు
అయినా పోనీలే
కాంక్షాపరిదగ్ధ స్వార్థ జీవులో, అభిశప్తులో, అమాయకులో –
వారిని ఏమనేది ఇవేళ!

జన్మభూమి, క్షమాహృదయ కన్న తల్లి కడివెడు కన్నీళ్ళతో చూస్తోంది
ఆ వలస మానవ ప్రవాహ పాద వీచికలు మరల తాకనీ
తాము పుట్టిన నేల.
తప్పిపోయిన దుడుకు పిల్లలు ఇల్లు చేరి తల్లి చల్లని వొడిలో
జల్లుకోనీ అశ్రుధనం ఈవేళ.

*

('ఆంధ్రజ్యోతి' వారపత్రిక 'ఈ వారం కవిత' – 30 నవంబర్, 1990)

# వెతుకుతూనే వుంటారు

వెతుకుతూనే వుంటారు
అవునమ్మా అవున్నాయనా
బతుకు మరకయినప్పుడు
మరకే బతుకయినప్పుడు
చేతనైనన్ని చేతులతో ఉతుకు కోసం
వెతుకుతూనే వుంటారు

కోకిలను ఎంబ్లెమ్‌గా ముద్రించి
రాబందుల నాణెం చలామణి అవుతున్నప్పుడు
శ్రామికుడు గునపంతో నేలను తవ్వితే
నేలకాక వాడి గుండె దొలుచుకుంటున్నప్పుడు
తనను తాను పేటెంట్ చేసుకుని
నమ్మకంతో విత్తనమై విత్తుకున్న రైతు
మరే పెత్తనమో మొత్తంగా మొత్తేసి
కన్నీటి కంకుగానే మొలకెత్తినప్పుడు
వెతుకుతూనే వుంటారు

అవునమ్మా అవున్నాయనా
కన్నీటిని తుడిచి, కలేజానిచ్చి
కాలం వెంట కదం త్రొక్కించగల నాడీ స్పందనకోసం
ఊపిరి ఊడల కోసం

సహారా కాని ఆసరా కాగల వెన్నెముక నేతృత్వం కోసం
వెతుకుతూనే వుంటారు

షావుకారు అంగట్లో బెల్లం దాచేసినప్పుడు
భూస్వామి చెఱకు దోచేసినప్పుడు
చింతపండు చింతల పండయి
అరటిపండు అందుబాటు ధరలో లేనప్పుడు
జీవితం ఉగాది పచ్చడికి
వేపచేదు తప్ప మరేమీ మిగలనప్పుడు
అవునమ్మా అవున్నాయనా
ఒకనాటికి తియ్యని ఫలాన్ని చవిచూపించగల
మావికొమ్మ చివర్ల
సహజసిద్ధంగా నవలేత్తే ఈనాటి ఎర్రచివుళ్ళ కోసం
వెతుకుతూనే వుంటారు

ఆశ చావని వాళ్లు, నిరాశ సోకని వాళ్లు
గతి తార్కిక ప్రకృతి సంప్రదాయం తెలిసి
వ్యవస్థను మార్చే గరిమ పోగొట్టుకోని వాళ్లు
సమసమాజ నిత్య వసంతం కోసం
వెతకుతూనే వుంటారు
అవునమ్మా అవున్నాయనా

ఆ అన్వేషక బృందంలో నువ్వున్నావో లేదో
నిన్ను నువ్వు వెతుక్కో

✻

('కృష్ణా పత్రిక (దినపత్రిక) 11 ఏప్రిల్, 1994)

# బిలం - కాంతిబలం

గుహ గుహ్యస్థలమే కావచ్చు
మండే హర్మ్యాల సహ్యతా అసహ్యతాల మాటున
ఒక రక్షణ బిలవలయం కావచ్చు.

ఎవరు పెంచి పోషించారు అజ్ఞాతాన్ని?
అణచివేతలో పుట్టిన ప్రతిఘటనం
అజ్ఞాతమెందుకవుతుంది?

అంతా బహిరంగమే–
అహంకారం బహిరంగమే.
అనవసర జోక్యమూ బహిరంగమే.
కూల్చింది శిఖరాలనయినా
కూలింది హృదయ కుహరాలలోనే.
అణురాశి వెంట అన్నం రాశి గుప్పించినా –
గుహలా తెరుచుకోవడానికి ఆకలి నోళ్లయితే ఉండాలి కదా!

యుద్ధమూ బహిరంగమయితే – బరిలో సమ ఉజ్జీలై
రెండు పక్షాలయితే ఉండాలి కదా!
ఏక పక్షమైనదేదయినా అద్దాల గదిలో కత్తి తిప్పే వీరత్వమే.

పగ శత్రువు మీదయితే ప్రజ చావడమేమిటి?
ఏ దేశ ప్రజలయినా కోరుకునేది
శాంతిని కానీ యుద్ధాన్ని కాదు.

కానీ శాంతి కోసం యుద్ధం చేయడమంటే -
వెలుతురు కోసం ప్రమిద ముట్టించడమే.
ఫెళఫెళార్భటులతో రవ్వలు రువ్వే టపాసులు
దీపావళికి సంకేతం అయితే,
యుద్ధం శాంతికి సంకేతమే!

ఇంతకీ యుద్ధాన్ని కోరుతున్నదెవరనే ప్రశ్న -
మడుగులో దాగిన దుర్యోధనుడా?
మీసం మెలివేస్తున్న భీముడా?
జబ్బ చరిచేవాడే వీరుడనుకోనక్కర లేదు.
అజ్ఞాత బృహన్నలా వీరుడే! కంకుభట్టూ ధీరుడే!

గాంధారానికీ, గాంధీకీ కూడా సంబంధం ఉండక తప్పదు!
తెగిపడిన బుద్ధవిగ్రహం తలా - తల్వార్ తిప్పవచ్చు.
శాంతి అంటే అగ్రమూ కాదు, ఉగ్రమూ కాదు.
జమ్మిచెట్టు మీంచి ఆయుధం దింపడం శాంతికే.
బోధిచెట్టు కింద బోధనలు గరపడం శాంతికే.

తనదే అసలు యుద్ధమనీ, అంతా పవిత్రత కోసమేననీ
బరిలో ఇద్దరూ అంటారు.
కానీ నిజానికి ఎవరో ఒకరే బరిలో ఉంటారు,
ఇంకొకరు దాగుంటారు-దేనిమాటునో,
అజ్ఞాతం యుద్ధాయుధం పదునయితే
అదను కోసం బహిరంగ మయినవాడు అట్టహాసంగానే
విజృంభిస్తుంటాడు.

ఇంతకీ చంపదలచింది ఉగ్రవాదాన్నో,
ఆ వాదాన్ని ఆశ్రయించక తప్పనిసరిచేసిన
అగ్రవాదాన్నో తేల్చుకోవాలి!
ధృతరాష్ట్ర కౌగిలి ప్రేమలు ఎవరికయినా ప్రమాదమే!
బిలంలో బలం వుండచ్చు.
ఆకాశ హర్మ్యంలో కనిపించని బలహీనత ఉండచ్చు.

ఎక్కువ మంది చేతులెత్తినంత మాత్రాన
ఒకటి న్యాయం కాజాలదు.
న్యాయం బహిరంగమయ్యేంత వరకూ అజ్ఞాతం తప్పదు!

అన్యాయం ఎవరిదయినా, ఎక్కడిదయినా
అంతం కావలిసిందే!
శాంతి సుఖాంతాల కోసం
సత్య సమేతంగా గరుడవాహనంపై
బిలం నుండి ఆకాశహర్మ్య బలం వరకూ
జైత్రయాత్రారంభం కావించవలసిందే
దీపశిఖాజ్వాలా తోరణాలు
ఎడారి గూటినుండయినా వెలిగించాల్సిందే.

✻

('నేటి నిజం' దీపావళి ప్రత్యేక సంచిక-2001)

# చలి

ఎత్వమిచ్చి కౌగిలిస్తే
వణుకెక్కడ వలపే కదా.

అచ్చుకిమచ్చు
తీవ్రవాది ఆకారం
కాలపు దుస్తుల మహత్తు కదా.

ఉత్తిష్ఠోత్తిష్ఠ సుప్రభాత లాస్యం
భక్తి అయినా
హృదయంలో చాలా ఆలస్యం.

పొగమంచు
ప్రయాణాన్ని గమ్యాలు మార్చి పొడిగిస్తే
మళ్ళీ మళ్ళీ భయంతో ఇదే
అలవిమానిన విమానంతో...

కూపోదకం, వటచ్ఛాయా
తాంబూలం, తరుణీకుచం
కాలానికి ఉష్ణహేల
ఎముకలు కొరికే జోల...

పేవ్‌మెంట్ పక్క కుక్కకే కాదు
ఆకలి కుక్కినపేనై కుక్కుకున్న

మునగదీసుకు మూడంకె వేసిన
అనాథ పిల్లకూ, ముదుసలి అవ్వకూ...

చితుకులు అంటిస్తే వచ్చే వెలుగు
చితికిన బతుకులకు సోకుతుందా

కాశ్మీరమేనా – గుర్తొస్తే వచ్చేది
ముంచుకొస్తున్న 'ముందస్తు' కూడానూ.
జనాభాకంటే ఓటర్లలా
కాలం కన్న అగణిత సంఖ్యలా...

గడ్డ కట్టించేది మంచుకురిపించేది
ఉన్ని మన్నించేది...

పెన్నూ వుంది గన్నూ వుంది
మనం పుట్టించడానికి ఇపుడు ప్రభుతకి
వెన్నే లేదు
ప్రజలు ప్రేమించకపోతే
వలపెక్కడ వణుకే కదా

మంచుపల్లకి భయపు అధికారానికి
గజగజలు తప్పవు కదా
చలిపులిస్వారీకి కాలం ఇదే సదా.

✻

('నేటి నిజం' 18 ఫిబ్రవరి, 2004.)

# కాంచన కాలోపద్రవం

రూపాయి బిళ్ళకై
గడియారం కరిగి పారుతోంది
ఎర్రని సెకన్లముల్లు రక్త చారిక
అనుక్షణం కదులుతున్న వ్యవస్థావాహిక
అధికారం చిన్న ముల్లు
సంక్షేమం పెద్ద ముల్లు
అంకెలు మాత్రం కొట్టుకుంటూనే వుంటాయి

ఎన్నికలు అలారం మోత అనుకోవడమూ భ్రమే.
చైతన్యం నొక్కేసి కప్పుకున్న సిద్ధాంతాల దుప్పట్లోనే
నిద్రా ప్రవాహంలో మునిగి
ఒడ్డుకు దాటేస్తాననుకుంటాడు

ముళ్లే అంతా ముళ్లే
అంకెలు కాల గణాంకాలు ఔను
గడియారం గోడకు వ్రేలాడదీసిన చిత్రాలు
టిక్కూ టిక్కూ టిక్కూ...
గుండె చప్పుడులో నాణేల మోత అధిగమనం
సిరలూ ధమనుల్లోంచి అవకాశవాద పంపింగ్
ఎడారిలో పరిగెత్తలేని ఒంటరి ఒంటె
ఇసుకలో ఉష్ట్రపక్షి
కదిలే కాళ్లు చేతుల్లో చేతల్లో పరుగులిడి

ప్రయోజనంగా ఫలించనప్పుడు
సాగీ సాగీ సాగీ ప్రవహించని కాలం
ఫ్రీజ్ అయిన ఒక మంచు ముక్కలా
మణికట్టు మీద అలంకార ప్రాయం

టైం ప్లీజ్!
సారీ! వీళ్లకు బంగారు చైన్‌ల స్ట్రాప్‌లున్నాయి కానీ
వాచీ లేదు, వాచీ వున్న వాడికి డబ్బుతో తప్ప
మానవీయ కాలంతో సంబంధం లేదు
రూపాయిలో పాపాయి కనిపించనివాడు కసాయిగా
కాలం జింకను తరుముతూనే వుంటాడు
హా లక్ష్మణా! కాంచన సీతాపహరణమూ తప్పదా.

*

('విశ్వంభర' త్రైమాస పత్రిక, జనవరి-మార్చి 1999)

# అంటున్నా

పోవలసింది పాత ఏడు కాదు
ఆపాత ఏడుపు
సాధించాల్సింది బహుమతి కాదు
ధీమతి.

అంతా నూతనమే
అన్నది భావనలో
అన్నింటా ప్రగతే
అన్నది సాధనలో.

గబ్బిలం
తలక్రిందుల పక్షి అయితే,
ఇసుకలో తలదూర్చింది
ఉష్ట్రపక్షి
అసలు చూడకపోవడం కన్నా
దర్శనపార్శ్వం
ఏదయితేనేం! మేలుకదా
ప్రార్థించే పెదవులకన్నా
పనిచేసే చేతులు గొప్పవి కదా!

గతం గతం అనే
గతానుగతిక కీర్తిబిలంలో పడి

బెకబెకలాడే కప్పకన్నా –
పైకి ఎగబ్రాకాలనుకునే పీత నయం!
ఒకరికాళ్లు ఒకరు లాగేసుకోకుండా
ఎగిరే పక్షిదే జయం!
రాయని భాస్కరుడి కన్నా
రాసే అనామకుడు మిన్న
పలకాల్సింది కవి కాదు
కవిత్వం అంటున్నా!

✻

('పత్రిక' మాస పత్రిక, మార్చి 2006)

# చిత్రగ్రంథి

శరీరపు ముడులకవతల
ముడివేసిన ఆత్మపరమాత్మలని ఆలోచించకు
ముడుల గురించే ఆలోచించు

ప్రాణశక్తులను పట్టుకుంటున్న
కొత్తముడి గురించే ఆలోచించు
మెలకువలో వుండగానే
అంతా ఏమార్చేస్తున్న కుట్ర జరుగుతోంది
పురులు పేనుకుంటూ...

చీకటిహాల్లో పధ్నాలుగు రీళ్ళ కుర్చీ – బతుకు
బతుకు మూడు దశలూ మూడు గంటలుగా ముడివేసి
దృశ్యశ్రవణాల సెవెన్టీ ఎమ్మెమ్ స్టీరియో ఫోనిక్‌లో
ఏమేమో రేస్ లోలోకి దూసుకువెళ్తున్న – మనుగడ

లాకప్ రూంలో థర్డ్ డిగ్రీ హింస కన్నా చిత్రమైన
స్వయం చోదిత స్వీకార అంశ
హింసా రిరంస.

పధ్నాలుగేళ్ల కుర్రాడు సీట్లో మాస్టర్‌బేట్ చేస్తాడు
చిక్‌బుక్ చిక్‌బుక్ రైలే
చిలిపి కిరణం థెరపీతో

ఏడో క్లాసు పిల్లాడు మూడో క్లాసు పిల్లను రేప్ చేస్తాడు
ఆనక అంచెలంచెలుగా దాదర్ ఎక్స్‌ప్రెస్‌లా ఎదుగుతాడు
రేపు వాడికి లాగులో
ఓ కొత్త అవయవంలా కత్తి కూడా వుంటుంది.

కామం కోసమో, డబ్బు కోసమో
వెరసి వట్టి సరదా కోసమో
మెదడులో విస్ఫోటన పతాక సన్నివేశాలు
రెపరెపలాడినప్పుడల్లా
వాడు హత్యాన్వేషిగా ఛేజ్ చేసుకుంటూ
విధ్వంసంలో మూసపోయి నినదిస్తాడు

బూతు మా జీవితం
రక్తపాతం మా ఊపిరి
సినిమా మా వేదాంతం

మానిసి
మనస్సులో, శరీరంలో ఏదో అవుతోందివాళ
సుప్రీం ధర్మాసనం కూడా
మానిసి మానస శీర్షాసనాన్ని విశ్లేషించి
ఆర్డర్ ఆర్డర్ సుత్తిదెబ్బ వేసినా
ఇది రావణకాష్ఠగ్రంథి
రగులుతూనే వుంటుంది
మొగలి పొద – బాంబుల రొద
విప్పిన కొద్దీ ముడి బిగుసుకుంటుంది
తెగిన తల తిరిగి తిరిగి అతుక్కుంటుంది.

వెయ్యేళ్ల క్రితం జంతువుల ఆట
జురాసిక్ పార్క్ ఎందుకు
నేటి స్వేచ్ఛాక్రూరమృగంగా తరాన్ని
వెంటాడి వేటాడి తీర్చిదిద్దే ఆస్కారం వున్న
ఏ సిన్మా అయినా
ఆస్కార్ కన్నా బలవత్తరమైంది

చూస్తూ చూస్తూండగానే మామూలు మనిషి
పొరలు విప్పుకుని
రీళ్లు రీళ్లుగా సెక్స్‌గా, హింసగా
శరీరంలోని గంధగ్రంథులన్నీ
రూపపరిణామం చెంది
నిష్కళంక మానస సరస్సులోంచి
సూపర్ డూపర్ కిల్లర్ డైనోసారస్‌గా
గుడ్డు పగలగొట్టుకుని బయటపడుతున్నాడు
మనిషిలో సుషుప్తమైన సర్వక్రూరమృగాలూ
జాగృతమైన రంధి

ఇవాళ మనిషికి నవగ్రంథులు కాదు
మరో క్రొత్త గ్రంథి చేరింది
మానిసిని తిరగేసి సినిమాగా చేస్తున్న
దశమగ్రంథి
చిత్రగ్రంథి

అటు ఆది శంకరాచార్య
ఇటు భగవద్గీత
అటూ, ఇటూల నడుమ
చిత్రగ్రంథితో అవతరించేది మటుకు ఆటోశంకరే.

✻

('ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రిక, 'ఈ వారం కవిత'– 2 సెప్టెంబర్ 1994)

# బిందు చేతన

వేడి కిరణమనే 'స్ట్రా' వేసి
సూర్యుడు సముద్రాన్ని తాగుతున్నాడు

నిజమే
కానీ ఆవిరి ఏదో మేఘం రూపెత్తదేం
విత్తును కోల్పోయినప్పుడు
మేఘం ఎలా వర్షిస్తుంది
మేఘం వర్షించనప్పుడు విత్తు ఎలా హర్షిస్తుంది

ఢీ కొనడానికి కొండలు లేవు
చెట్లను కూల్చుకుని
చెమ్మదనాన్నీ
బ్రతుకు కమ్మదనాన్నీ
ద్రవించే గుండెల్నీ
కోల్పోతున్నాం

పరుచుకున్న ఇసుక ఎడారిలా
విస్తరిస్తూన్న నేల
అనుక్షణం లోతులకు పోతూ
ఇంకిపోతున్న జల
పట్టుకోవడానికి నీళ్లూ లేవు, కన్నీళ్లూ లేవు
గొంతు ఎండిన ప్రాణం
ఒక జీవశిల

ప్రకృతి సహజ వనరయిన
నీటి కోసం
యుద్ధాలు చేసుకునే స్థితికి
మనల్ని మనం దిగజార్చుకునే
నైచ్యం వద్దు, నిర్లక్ష్యం వద్దు

ఒక మొక్క నాటడమంటే ఇవాళ
మానవత్వాన్ని నాటడమే నని మరవద్దు
జలచైతన్యమే జన చైతన్యం
జీవ చైతన్యం.

*

('యోజన' మాస పత్రిక, మే 2003.)

# స్వగతం - స్వాగతం

చీకటి మేఘాన్ని మథించి
వెలుతురు వర్షం కురిపించడం
అనుభవాన్ని తవ్వి తోడి
అనుభూతి జలను పైకి ఉరికించడం
వేదనల సారాన్ని పిండి
వేదమంత్రం పలికించడం
ఏదయినా నూతనమే

గతాన్ని వర్తమాన కవ్వంతో చిలికి
భవిష్యత్తు మీగడను పైకి తేల్చడమే ముఖ్యం

నిరాశలో మునిగినా తేలవలసింది ఆశ
నిట్టూర్పులోకి దిగినా చెంగలించాలి చైతన్య శ్వాస

ఎంత చక్కనిదైనా గతమంతా వట్టి స్వగతం
ఆ గతాన్ని అందిపుచ్చుకుని పురోగమించడమే సమ్మతం
అదే సకల జన హితం
మానవత్వ మతం
దానికే సుస్వాగతం.

*

('ఆంధ్రభూమి' సచిత్ర వారపత్రిక, 12 జనవరి 2006.)

# కలగా... కలగా పులగంగా...

నైట్ బల్బు ఆరింజపండు
సాగదీసిన వెన్నముద్ద ట్యూబ్‌లైటు
గాలిని చక్రాలు చేసి తిప్పే
సీలింగు పంఖేరుహం
డబుల్ కాట్ మీద డబ్బులు కాటేసిన
క్యాట్ - పిల్లి - పిల్లతో కాళ్ళావేళ్ళా
కాళ్ళమీదవంచి పైకి వేళ్ళల్లా-ఎల్లవేళలా
పత్రికపుటలు తిరగేస్తే
నగరం మూలలు అరగేస్తే
ఆరగిస్తే అరుకేసినా అరగని అరుగుల గులగుల
తొడల మధ్య జిలజిల
ఈ దేశాన్ని పమెల్లాబోర్డెస్ బోర్డుకట్టుకుందా
బొడ్డుకిందకి చీరకట్టుకుందా
రైలు బోగీల వరస తప్పి భోగం అఖాతంలో పడ్తుంది
సెక్స్... సెక్స్... సెక్స్. - నెక్ట్స్

కత్తి కారుచవుక
తుపాకి పాకితే అందుతుంది
బాంబు సంగతా! బాబులందరి మధ్యా అదే
రక్తం ఇంకుబుడ్డి

ఇంకనిది ఇంక నీదీ ఒక్కటే రైటు
లెఫ్టే రైటు
చావు బావురమనేదెక్కడ?
చమురుబావుల తక్కెడ ఇప్పుడిప్పుడెక్కడ
మహాసామ్రాజ్యాలు మట్టి కలిసిపోతున్నాయి
ప్రజాస్వామ్యం రెక్క విచ్చిందహో!
రెక్కల్లో బలముందా? కుక్కల్లో కులముందా
ఇంతకీ ముందా వెనుకా
దేవేరి కావేరి అస్సాముగరిడీ
పంజాబు పంజాల జాలు
ఢిల్లీ ఒక లిల్లీ అనడం సిల్లీ
రాజకీయం మంచానికి నల్లి
హైదరాబాద్ గల్లీ గల్లీ
చతుశ్శతాబ్దిపుచ్చు పల్లీ

ఇటు తిరిగి
మళ్ళీ సాహిత్యం గురించి దొర్లుతావ్
నా చేరాతలేలా? నాచనసోమన చర్చనీయాంశాన
కమర్షియల్ కుస్తి మల్లాది
దండగమారి ఎండ ఊరగాయ జాడీ
వేల వేల గుంటల చితి చింతల్లో
చింత చచ్చినా పులుపు చావని సైకో
అందరి ద్రాక్షల సమరం

గ్రూపిజం కక్షల వికవిక కవి సమయాల
అ.వి.రళ రసాల పద్య మద్య సదస్సుల
అందమైన ఆఫ్‌సెట్
లెటర్ కంపోజ్డ్ ఫోటో సెట్ల ఫోజు గ్రంథాల
ఆసుపత్రి అవార్డులు
అంతా త్రిశంకుశంకే.
సెక్స్ – రాజకీయం – సాహిత్యం

ఆధునిక యాంత్రిక కుహనా త్రివిష్టపం.

శరణం గచ్ఛామికి
కమఠం కచ్ఛపం తాబేలు
అన్నీ బెంబేలు (అన్నీ ఒహటే కామోలు)
కుదేసిన కుందేలు
దేశంలో మోసమ్‌కీహోల్
హోల్లోహోల్‌సేల్ మాల్
క్లూలేని పజిల్

ఇక్కడ సిద్ధార్థా! వట్టి వ్యథార్థా
మమ అనుకోకపోతే
వర్థి నస్మరంతిగాడివి
ఎన్‌కౌంటర్‌కు చిక్కిన దాడివి
శతకోటిలింగాల్లో ఓ బోడివి
తిరగబడితే నిజానికి ఓ బోడోవి.

✻

('ఆంధ్రభూమి' దినపత్రిక 'అక్షరం' 22 ఏప్రిల్, 1992)

# రాజకీయ కార్టూన్

ఓట్ల పెట్టె కొరకు పుట్టు నినాదాలగాలి
గరీబోళ్ళ వద్ద కట్టు ఆదర్శం జోలి
జనోద్ధరణ మిషసాగే పార్టీలకేళి
బాంబులతో భయపెట్టే రాజకీయహోలీ

సారా పీపాల చుట్టు చుట్టిన నల్లడబ్బుగారడీ
సత్యమేవజయతేలకు కట్టినట్టి పేరడీ
విదేశీయం పేరుమీద హైటెక్కుల ఆరడి
కార్గిల్ టార్చీలతోనె టార్చరొచ్చు ఎవరెడీ

అకు వక్క కాలు కీలు ఏవైతేనేం గుర్తులు
సామాన్యుల ఎన్నికలల నార్పివేయు హర్తలు
సమతలాల పేరు మీద తలలు తెగే క్రీడ
రంకు బొంకు నేర్చినట్టి వదిలినట్టి వ్రీడ

శక్తికొద్దీ సాగే మ్యూజికల్‌ఛైర్ ఆట
శ్రుతి తప్పిన వీణమీద గార్దభాల పాట
చిత్రాతిచిత్రంగా సినీరంగపు రాట
కట్టేసుకు పోదలచిన పాలిటిక్స్ బాట

పులులు తోడేళ్ళు సింహాలు నక్కలు
యథేచ్ఛగా సంచరించు బ్రతికిన కాలేజీ
ప్రగతిపథం అభ్యుదయ పయనంలో బహు లేజీ
స్వాతంత్ర్యం సామ్యవాదం పదార్థాల ప్యాకేజీ

కుళ్ళిన కోడిగుడ్డులోంచి కారే అధికారం సొన
ముప్పైరెండు పళ్ళూ రెండుకోరలతో నవ్వే గణజనమన
పార్వతి తనయా గజాననా వినాయకా ఘనాఘనా
ఇదయ్యా భూతగణం వర్తమాన తీరు ఈ భూతలాన

కమాన్ ఇండియా దిఖాదో
సుస్థిరతో, సంకీర్ణమో రాసి వున్నదేదో

✻

(ఆదివారం 'ఆంధ్రప్రభ', 12 సెప్టెంబర్ 1994)

# ఉన్నంతలో ఉడుతలవ్వండి

బఠానీలు కొన్నా
మిఠాయిలు కొన్నా
ఒక కాగితం పొట్లంగా చేతికి చేరి
అనుభూతి చుట్టుకునేది
ఆస్వాదనలో ఆనందం
గుండె నిండుగా పట్టుకునేది
అది నా చిన్నప్పుడు

కాగితం పొట్లాలు కనుమరుగై
చేతిగుడ్డ సంచీ
వావిలాల మార్కుగా వెక్కిరింతకు గురై
ప్లాస్టిక్ సంచీ ఫ్యాషన్లు ఫ్యాషన్లుగా కూడా పాదంమోపి
నా వెంట పడింది

పెన్సిల్ ముక్క కొన్నా
పట్టు చీర కొన్నా
ఇవాళ అన్నీ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల్లోనే
పాల ప్యాకెట్టు కొని అలాగే పట్టుకుపోతానంటే
అమ్మినవాడే వింతగా చూస్తాడు
క్యారీ చేస్తున్నది బ్యాగ్‌ను కాదు
'వెరీ వెరీ బ్యాడ్'ను అన్న గ్రహింపేదీ?

పర్యావరణ పరిరక్షణకు
ఎక్కడిదాకానో ఎందుకు
ముందు ప్లాస్టిక్ సంచీని పరిహరించగలమేమో చూడండి
మళ్లీ కాగితం కవరునో, చేతి గుడ్డ సంచీనో ఆశ్రయించండి

కొన్ని కొన్నింటికి
చేతులూ, చొక్కాజేబులూ, చీరకొంగులూ కూడా
క్యారీ బ్యాగులే అని గ్రహించి
ప్లాస్టిక్ వ్యర్థాల కాలుష్యానికి కారణం కాకుండా
సహజ ప్రకృతికి తోరణం కట్టండి
స్వచ్ఛ జీవన వారధి నిర్మాణానికి
ఉన్నంతలో ఉడుతలవ్వండి.

*

('నేటి నిజం' 31 మే, 2007)

# స్నేహం

ఒక వశీకరణ శక్తి
స్వచ్ఛ హృదయానురక్తి
కొత్తగా ఉన్నప్పుడే కాక
పాతబడినకొద్దీ బాగుండేది
హాస్యాలూ, రహస్యాలూ భరించేది
సంతోషాన్ని రెట్టించి, సంతాపాన్ని భాగాహారించేది
జీవితపు కమ్మదనాన్ని నిలిపే
నీ కంటి చెమ్మతనం ఆరిపోనీయనిది

దేహాల హృదయాల కాదు కేవల దారి
ఆత్మలను పెనవేయు కైవల్య గోదారి
ఒకరికిస్తే ముగిసేది, సమసేది కాదు
అంతంకాదది ఆరంభం
అది నతమస్తం, అభయహస్తం, అది సమస్తం
అస్తవ్యస్థాన్నయినా అందమైన హారంగా మలచే యుక్తపదగ్రస్తం
ముక్తిపథ శాస్త్రం

యావత్ప్రపంచం నిన్ను వదిలి వాకౌట్ చేసినప్పుడూ
నీలోకి ప్రవేశించి చేస్తుంది నీ గుండె తలుపు చప్పుడు
గుప్పెడు మల్లెల సుగంధం – జన్మాంతర బంధం
కేవలం ఒక దయారేఖో, సానుభూతి లేఖో కాదు

అంతఃకరణంలో విశ్వాసంతో వెలిగే చిరుదీపం
ముసురు హృదయాన విరిసిన ఇంద్రచాపం

ఆలోచనలతో తూచేది, పదాలతో కొలిచేది కాదు
అనిర్వచనీయ అనుభూతి పరమాత్మ
ప్రపంచమంతా పరివ్యాప్తం కావాల్సిన విశ్వాత్మ
ఇరువురిమధ్య హాయిగా నెలకొనగలిగే మౌనం
ఎడారిలోనయినా చిటికెలో తీరే దాహం
అదే స్నేహం

స్నేహం ఒక్కోసారి ప్రేమతో ముగుస్తుంది
కానీ స్నేహంలోని ప్రేమ కలకాలం నిలుస్తుంది.

✻

('ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక, 16 అక్టోబర్ 2003.)

# బాధాపుష్పం

యౌవనాన్ని పువ్వుతో పోల్చడం
వలపు పూలతోటగా, వయసు పూలబాటగా
కవులు కవితలల్లడం
సాహిత్య పునరుజ్జీవన కాలం మాటే కాదు
మానవ జీవన పరంపరాగత భావన.

ఔను! ఒక పువ్వు గురించే అంటున్నాను
రోమన్స్ పలికిన విండ్‌ఫ్లవర్!
యానిమన్
లవ్లీ ఎర్రటి పువ్వు!
ప్రాచీన చరిత్ర ప్రాచీముఖం నుండి
సముద్ర తీరం నుంచి దూరంగా
భూభాగం ఆవరించి వున్నమేరా కాన్పించగల
పవన పుష్పాలు యానిమన్స్
సున్నితమూ, క్షణభంగురమూ ఐనవే ఐనా
వసంతకాలపు గ్రీకు పచ్చికమైదానాలనిండా
పరిమళించే ఎంతో అందమైన పూలు

ఊపిరిలోని ఉఛ్వాసమో, నిశ్వాసమో
ఎంత లిప్తపాటో
అంతే సమయంలో విరిసి

గంధమాదనంగా మాయమైపోయే
మధుర జ్ఞాపకాల విరి భావుక సిరి.

గ్రీకు పురాణంలోని
అఫ్రొడైట్, అడోవిన్, ప్రేమికుల కథతో
ముడిపడి ప్రతీకాత్మకమైన యానిమన్
ప్రియుని మరణంతో ప్రియురాలి కన్నీటి నుండి
పుట్టిన బాధాపుష్పంగా
కన్నీటికీ, బాధకూ, మృత్యువుకూ చిరసంకేతం.
అడోవిస్ యువ నాటినుంచి అశాశ్వత యౌవనానికి చిహ్నమైనది.

ఆమె కళ్లు అరక్షణంలోనే ఎండిపోయాయి
అఫ్రొడైట్ తన ప్రియుని మరణం నుంచి
మరుక్షణమే కోలుకుంది
అతనిని వెనువెంటనే మరిచిపోయింది
అందుకే త్వరితగతిన మార్పు చెందే
యువ ప్రణయానికి ప్రతీకగా
ఆమె గాలి కన్నీటిపూవై యానిమన్ నిలిచింది.

❖ ❖ ❖

ప్లినీ ద ఎలర్ట్ ఒక రోమన్ తాత్త్వికుడు
అన్నాడు కదా
మృత్యు కళేబరం పై నుంచే
వర్తులాకారపు పూలదండలో
ఉండదగినది యానిమన్
యానిమన్ వైద్య మహత్తు
తలనొప్పిని పోగొట్టేది మాత్రమే కాదు,
పొత్తి కడుపులో మంటనూ, వేడినీ, వాపునూ
మటుమాయం చేస్తుంది.
సంవత్సరాదిని పూసే తొలి పూవు

యానిమన్‌ను తింటే
ఏటికేడాది ఎలాంటి రుగ్మతలూ రావన్నాడు.

❖ ❖ ❖

మధ్య యుగాల కాలం నుండి ఈ పూలు
ఎడబాటుకూ, బాధకూ, మరణానికి
జ్ఞాపక చిహ్నాలయ్యాయి
క్రీస్తు ఆత్మబలిదానాన్నీ, అమరవీరులనీ
ఎర్రటి ఈ పూలే స్ఫురణకు తెచ్చి
మనోధ్యాన పుష్పాలుగా యానిమన్స్
పవిత్రాత్మ సందేశాన్ని అందుకునేలా
మనిషి హృదయాన్ని మేల్కొల్పుతాయట

❖ ❖ ❖

యౌవన పుష్పాలనే రూపకాలంకారం
అందమైందే కాదు,
జీవితం అశాశ్వతత్వాన్ని అభివ్యక్తీకరిస్తూ
యానిమన్ – బాధాపుష్పానికి
ఎంతో అర్థవంతమైంది కూడా.

✻

('ఆంధ్రభూమి' దినపత్రిక 'సాహితి', 19 నవంబర్ 2007)

# జీవితేచ్ఛ

గోడ పగులులోంచి
మొక్క మొలిచినప్పుడు
భగ్న హృదయంలోంచి
ఆశ చివురించదా

గోడలు నిర్మించే వాళ్లు
ఆశలను ఛిద్రం చేస్తారు
ఆశలు నిర్మించే వాళ్లు
గోడలైనా కూలుస్తారు

కులం మతం గోడలైనా
ప్రేమ ఆశల మొలక
ఎంత మ్రోడులోనుంచయినా
తలెత్తి చివురిస్తుంది

మొక్కవోని దీక్షతో
మొక్కలు నాటాలి
అవరోధాల గోడలధిగమించాలి
నీడపట్టు మనుషులవ్వాలి

విత్తనాలు
హృదయాల్లో వుంటాయి
విస్తరణలు
జీవితాల్లో వుంటాయి

జీవితాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి
మృత్యుశ్వాసనధిగమించి
జీవితేచ్ఛ పరిమళించాలి.

*

('సాహితీ తేజం', ఆగస్టు 2007)

# అగ్ని నగ్నీకరం

ఓ స్వెట్టరో, మేజోడో అల్లినట్లు
ఊహల ఊలుదారపు ఉండలు ముందేసుకుని
కవిత్వాన్ని లేసుపని చేస్తున్నారు

వస్తువనే వస్త్రం మీద ఒక చట్రం బిగించి
అనుభూతి నీలిదారాలతోనో
ఆయుధం స్పృహ ఎరుపు దారంతోనో
కుస్తీపట్ల సర్కస్‌ఫీట్ల మేధోమయ సూది బెజ్జంలో దూర్చి
వాక్యాల గొలుసుకుట్లూ, పదచిత్రాల ఎంబ్రాయిడరీ వర్కూ
చేస్తున్నారు.

ఒక ఆదిని తీసుకుని కత్తిరింపుల క్లాసులో
శిక్షణ పొందినట్లు
కవితను ఓ అద్దాల జాకెట్టుగానో
రెవల్యూషనరీ కమర్షియల్ సిన్మా కాస్ట్యూమ్ డ్రెస్‌గానో
కుట్టుమిషను ఎక్కించినట్లు
బాబిన్‌లో తిరుగుతున్న దారం సంగతి తెలియదన్నట్లు
యధాలాపంగా యంత్రాన్ని పని చేయిస్తున్నారు,

సాగర సంతోషంతోనో, శివతాండవంతోనో
మరమరాలు సేవిస్తూ –

ఎంత అల్లిక! ఎంత ఎంబ్రాయిడరీ వర్కు! ఏమి కుట్టు!
అల్లికలూ కుట్ల కవిత్వం
గాయపడ్డ హృదయాలను కుట్టగలుగుతోందా?
జనజీవన మమేకమై అల్లుకోగలుగుతోందా?

వంటిపై చొక్కాయే లేని కుర్రోడికి
గుండెకు తగిలించుకోమని
పైమెరుగుల ఎంబ్రాయడరీలెందుకు?
కాస్ట్యూమ్ కుచ్చుటోపీ లెందుకు?

కవితను నగ్నీకరించు
కవితను అగ్నీకరించు.
కవిత అగ్నినగ్నీకరమని గ్రహించు.

*

('ఆదివారం ఆంధ్రజ్యోతి' 3 ఫిబ్రవరి 1991)

# భూమి కోసం ...

భూమిని నమ్ముకున్న వాడికి కాదు
భూమిని అమ్ముకున్నవాడికి – రోజులు
పంట పండేది రైతుకు కాదు
రియల్ ఎస్టేట్ వ్యాపారికి

పంట పొలాలు రొయ్యల చెరువుల మీదుగా
నేలమట్టమై వట్టి భూములయ్యాయి.
పల్లెలో సొంతానికి సెంటు భూమిలేదు
పట్టణంలో సెంటు కొట్టుకుని తిరిగే
విలాస జీవితం సంక్రమించింది అంటే –
వాడు ఆక్రమించుకున్న భూమే కారణం.
చిన్నప్పుడు నేలాబండా ఆడుకున్నట్లు
వాడు బండాడు అయినా – నేడు
నేల నాలుగు చెఱగులా కాకున్నా
ఏదో ఒక చెరగును చెరపట్టిన మాత్రాన
బడాబాబుగాడయ్యాడు!

నాలుగురాళ్లు, ఒక కంచె,
జబర్దస్తీ, అధికారగణంతో దోస్తీ –
ఇవి చాలు పొందేందుకు అక్రమాస్తి
గూండాగిరి గుండెసిరి
పట్టణంలో ఏ శివారులోనో,

ఏ ప్రాంతంలోనో, ఎకరా నేల –
టోకరా వేసేందుకు టోకున దొరక్కపోతుందా!

పల్లెలోంచి పట్టణం గల్లీకి వలసవచ్చిన
పేద మాత్రం –
ఎక్కడో ఓ గుడిసె వేసుకున్నా
రోడ్డు వెడల్పు పథకంలో,
సుందర నగరీకరణ పథంలో –
ఆనవాలు లేకుండా పోతుంది!

ఏ ఫ్లైఓవర్ నిర్మాణానికో
రెక్కలు కూలి ముక్కలవుతుంది
ఔటర్ రింగురోడ్డు
అబ్బో! అది ఒక తూనాబొద్దు –
అలైన్‌మెంట్ మారినప్పుడల్లా
చదరపుగజం ఎవడి గుండెల్నో తొక్కి మరీ
ఊరేగుతుంది.

ఓ స్థలం కొనుక్కున్న క్షణం నుంచీ
ఆశ నిరాశలు కొరుక్కుతినడం
మధ్యతరగతి బ్రతుకు గతే!
ఇల్లు కట్టితివా అని ఎవ్వరడిగినా –
"స్థలము కొన్నాడ రసికాంధ్ర జనుల ఎడద
ఇల్లు కట్టుట అది నా వల్లకాదు"
అని ఉత్పలకవిలా
సరసంగా ఉత్త కబుర్లు చెప్పుకోవాల్సిందే
ఎందుకంటే –
సరసమైన ధరలకు భూములు లభించవు
అమ్మబడవు.

ఫోర్త్ ఎస్టేట్ ప్రపంచం కూడా
రియల్ ఎస్టేట్ భూభాగోతాలతో
తథిగిణతోం నృత్యాల పాలే
ఇప్పుడంతా నేలపాలే

పాలకులు, పాలితులు అంతా
నేలబారు కబుర్లే చెబుతారు నేడు
రోడ్డు రోలర్లు, బుల్‌డోజర్లు, షేర్లు
పట్టణమంతా భూప్రపంచమే
మూడొంతుల నీరు కారిపోతున్నా
స్థితి –
భూబకాసురులదే ఏకచ్ఛత్ర గతి
రియల్ ఎస్టేట్ వ్యాపారిదే గ్రహస్థితి
భూమి చీల్చుకుని భూదేవే నేటికీ
లోపలికి పోయే పరిస్థితి.

*

('నవ్య' వారపత్రిక ఏప్రిల్ 18, 2007)

# కొత్త పల్లవి

ఆకులు రాల్చుకున్న తరువు
చిగురెడు వసంతం కోసం తపస్సు చేసి
ఆమని సాక్షాత్కారం పొందుతుంది
ఆతపానికి ఆవిరైన జలధి
చినికెడు మేఘమై రూపొందాలని
అంబరాన్ని ఆశ్రయించి వర్షమవుతుంది
నల్లబంగారమైన నిప్పు
నాగరికతా జ్వలనం కోసం ఉద్యమించి
కాంతిచ్ఛటలతో కరచాలనం చేస్తుంది
రాల్చినా వదిల్చినా రూపాంతరమైనా
చ్యుత ద్యుతులు ప్రకృతిలో
నుత ధృతులుగా శ్రుతులు చేసుకుంటాయి

కానీ మనిషే
వలువలూ విలువలూ దిగజార్చుకుని
సంస్కృతినీ సభ్యతనూ పోగొట్టుకుని
నీతినీ నిజాయితీని నీరుగార్చుకుని
మమతనూ మానవతనూ మసిచేసుకుని
ఆర్థికమనే ఒక రంగుల వలయంలో పడి
మనిషే కాకుండా పోతున్నాడు

సవాలక్ష రూపాల్లోకి పొరలు పొరలుగా
పొడలు పొడలుగా పొడగట్టగలిగే మనిషి
మానుషాన్ని మాత్రం
మటుమాయం చేస్తున్నాడు

సర్వధారీ
ప్రకృతిగత నూతన యుగాదీ
మానవ ప్రకృతిని మానవుడు ధరించేలా చెయ్యి
విస్మరిస్తున్న విసర్జిస్తున్న విలువల చైత్రాన్ని
మానవాత్మలో తాదాత్మ్యం చెయ్యి
సర్వధారి పర్వదారి కానియ్యి
జీవన గీతం రానియ్యి!

*

('ఆంధ్రభూమి' సచిత్ర వారపత్రిక, 17 ఏప్రిల్, 2008)

# ఒక పక్షి కోసం

ఇంకా చూడడమే –
ఒక పక్షి కోసం
పొాయె 'ట్రీ' మీద వాలే ఒక పక్షి కోసం

కాండం బలంగానే వుంది
శాఖోపశాఖల విస్తరణా జరిగింది
ఆకుల గుబురులకేం కొరత
ఎన్ని గాలివాటులకు తట్టుకున్నదో
కాని ఈ పోయే 'ట్రీ'కి ఏదో పువ్వే లేదు,
పండూ రాదు

ఓ పువ్వెడు వసంతం గానీ
చిరుదీక్షా తపస్సమీక్షా ఫలంగానీ కనిపించనందుకేనా
పక్షి ఇటుకేసి రాదు

తొర్రలో తూటాలు దాచుకున్నా
కొమ్మల గుబుర్లలో శవాకారంలో
పాండవుల ఆయుధాలున్నా
రక్షోరక్షతి రక్షితః కోసమేగా!

బాల్యం ఉయ్యాలలు, యవ్వన ప్రేమావేశాలు,
వృద్ధాప్యం నీడలు
మూడు కాలాల ముప్పేటే – అయినా పక్షి రాదేమిటీ

గద్దలొచ్చాయి, రాబందులొచ్చాయి, హైజాకయిన
విమానాలొచ్చాయి
చెట్టుకొమ్మల్లోకి స్త్రీల పైటలొచ్చాయి, దళిత పాటలొచ్చాయి
ఇంకా గాలివాటు ఉద్యమవాదాల
బోలెడు గాలిపటాలు
వచ్చి తగుల్కొన్నాయి
చిరిగాయి, ఒరిగాయి, మాంజాలు వ్రేలాడాయి
కొమ్మకు ఉరేసుకోడానికి ఆశోపహతులొచ్చారు
చెట్టుకింద ఘర్షణకు అధికారులు, రహస్యకారులు వచ్చారు
కానీ పొయెట్రీ మీద పక్షే వాలడం లేదు

వలసపోయిన పక్షి ఎప్పుడో వదిలేసిందీ చెట్టుని
చెట్టునీ, గుట్టనీ పట్టుకుని
పక్షి వలసపోయిన జాడ మాటే తలవక
పొయెట్రీ పెరుగుతూనే వుంది

ఊడలొచ్చాయి, నీడలొచ్చాయి, చెట్టుకు పిల్లలొచ్చాయి
పిల్లపిల్లకీ గోడలొచ్చాయి, గదులొచ్చాయి, గవాక్షాలొచ్చాయి
గదుల్లోకి సముద్రాలొచ్చాయి, తుఫాను గాలులొచ్చాయి
మోహనపు పిలుపులొచ్చాయి, ప్రాణహిత సందేశాలొచ్చాయి
ఇంకా సవాలక్ష కొలబద్దల మిలీనియం
మెరుపులొచ్చాయి
పక్షే రాలేదు

సామ్రాజ్యవాద సంస్కృతి
చెట్టుకి పేటెంట్ గురించి చర్చిస్తోంది
కంప్యూటర్‌లో దీనికో వెబ్‌సైట్ వస్తోంది
కానీ ఇప్పుడు పక్షి వాలని చెట్టూ ఓ చెట్టేనా
ఇప్పుడు పాయెట్రీపై పిట్ట ఆకారం వుందేమోగానీ
కమర్షియలైజ్ అయిన దాని కువకువ వుందేమో గానీ
కొత్తగా తగిలించుకున్న సాంకేతికతా,
ధనమూల్యం రెక్కలున్నాయేమో గానీ

ఇంకా మాటాడితే
పెరుగుతున్న కీర్తి వ్యామోహపు ఓ తోక వుందేమోగానీ
పిట్ట మనసు లేదు, ప్రాణవత్ చేతన లేదు
ఆత్మ లేదు
పొయెట్రీపై పక్షి లేదు
పొయెట్రీకై పక్షి రాదు

ఇంకా చూడడమే పొయెట్ 'ట్రీ' కవితాత్మ కోసం
మహనీయ మానవాత్మ కోసం – పక్షి కోసం
ఇంకా చూడడమే – ఒక పక్షి కోసం
పొయెట్రీపై వాలాల్సిన ఆ పక్షి కోసం.

✻

('ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక, మే 2000)

# కౌతుకం

ఖగోళ తిమిరమంతా కొనవ్రేళ్ళలోనే
చిద్రుపలు చిద్రుపలై రాలుతున్న గోళ్ళరంగులా
ఖండిత నగ్న భంగిమలు
ఎంటర్–ది డ్రాగన్
మౌస్‌డ్రాగ్ చేసి నెక్ట్స్ నెక్ట్స్ అంటూ న్యూడ్ డాట్‌కామ్‌ల్లో
చొంగలు కారుస్తున్న మనోభంగ భంగిమలు
తమకం తట్టుకోలేక అరచేత అల్లల్లాడిన నరం
పుత్తడి కణికో, బిళ్ళో..

వాళ్ళు పుస్తకాల్లోంచి ఎప్పుడో ఎగిరిపోయారు
మిత్రుల సంభాషణల్లో ఏనాడో జారిపోయారు
గదిలో వుండే అమ్మా నాన్నా వారికేం చెప్పరు
ఎవరూ శాస్త్రం గుట్టుమట్లు విప్పరు
గడ్డం మీసం మొలిచిన
స్తనం, ఆ స్థానం – పుష్పించిన కౌతుకాల మీద
నెట్‌లూ, ఛానెల్లూ, సినిమాలూ మత్తుమందు చల్లుతాయి
క్లోరోఫారం అలుముకున్న గుండెకు
ఆపరేషన్ కత్తై గాయం చేస్తుంది
ఒక భంగిమలో మునిగి వారు సముద్ర భూకంపమౌతారు
అనామీలు, సునామీలవుతారు
ఆవురావురంటాయి శృంగార తలపోతల అంగాంగాలూ

ఖగోళ తిమిరమంతా
ఇప్పుడు కనుగుడ్ల కదలికల్లో...

చిద్రపలు చిద్రుపలై వారు రాలిపడుతూంటారు
తుఫాను స్ఖలనాలతో, భూగోళ వమనాలతో

ఎవరు రక్షిస్తారు వీళ్ళని, ఎవరు ఛానలైజ్ చేస్తారు?
అద్భుత దేశ భవితవ్యం పోర్నోగ్రఫీల్లో చ్యుతమై
అంతరించిపోకుండా..
యువత కౌతుకాన్ని క్రమబద్ధీకరించాలి
ఖగోళమంతా విజ్ఞానకాంతులు ప్రజ్జ్వరిల్లేలా
శృంగారాల్ని కాదు
అంగారాల్ని పండించాలి.

✻

('విశాలాంధ్ర' దినపత్రిక సాహిత్యానుబంధం, 20 మార్చి, 2006)

# కృత్యాదిగా ..

కనుల కాసారంలో
చూపు చేపపిల్లై పరిభ్రమిస్తోంది

శ్రవణబిలంలో
మాట ఒకటి శబ్దతరంగమై
ప్రతిధ్వనిస్తోంది

ఒక నిశ్వాస గాలి తరగై
నాసికాపుట బహిర్గతమౌతోంది

పెదవుల మధ్య
భూమధ్య రేఖలా
దరహాస రేఖ ఒకటి దర్శనీయమవుతోంది

వికటభ్రుకుటి
ధనుర్ధారి విడిచిన బాణంలా

గొంతు దిగని భావమొకటి
వేలిచివరి అఖాతంలోంచి
కాగితం సముద్రంలో దూకి
ఆత్మహత్య చేసుకోబోయింది

కలం పడవ భావాన్ని
అక్షరతీరం చేర్చి
అభివ్యక్తి ఊపిరులూది
ప్రాణదానం చేసింది

మొహం మొత్తంగుండా కవి
మనిషిగా నిలబడ్డాడు
సహృదయ పాఠక హృదయంపై
ప్రేమతో కలబడ్డాడు.

✻

('పత్రిక' మాసపత్రిక, జూన్ 2006)

# ఓదార్పు

నా చేయి తగలగానే నీ మనసు మేఘం
మాట చినుకై కురవాలనుకుంటాను
కానీ నీ కంటి గోదావరి నేనీదలేను

ఒడ్డున నిలబడి తుఫాను చూడగలనే గానీ
ఊరడింపు పడవవేసుకుని
నీలో బుజ్జగింపు ప్రయాణం చేయలేనివాడిని.

అవును! నాకు ఊరడించడం రాదు
బతిమాలడం రాదు
నీ దుఃఖానికి భయంతో బిగుసుకుపోవడం
దానికి నేనే హేతువునేమోనని లోలో గిరికీలు కొట్టడం,
స్థాణువునై తెలియని నొప్పి పువ్వు పూసి
విసుగులో, వేదనలో, చేతకానితనం చీకాకులో
చిట్లి పగలడం తప్ప
నాలో నువ్వే ఒదిగిపోయి, నీ అంతట నువ్వే
బహిర్గతం కావాలనీ, ఎందుకు అవవనీ అనుకుంటూ
నీ వేదనా తీవ్రతను తట్టుకోలేనివాడిని

నీకు నేను ఎలా సాంత్వనం కాగలనో తెలీదు
ఏం చేస్తే, ఎలా మాటాడితే, ఎలా ప్రవర్తిస్తే
నీకు ఉపశమనమౌతుందో అర్థంకాదు

ఏదో మాటాడి నిజాయితీగానే నిన్ను స్పర్శించినా
ఆ క్షణాలు నీకు అత్యల్పాలు
నాకు మాత్రం నువ్వెందుకు బహిర్గతం కావడంలేదన్నంత
సుదీర్ఘాలు.

నేనేం చెయ్యను?
ఏం చెయ్యననేగా నీ ఆరోపణ
నిజమే! నా మౌనం అర్థం అవుతుందనుకోవడం
నాలో మాటలు పెగలకపోవడం
నీలో దుఃఖ మేఘం కమ్మినపుడల్లా
అది తుఫానై, వరదై నన్నే చుట్టుముడుతుందని
నీకు తెలియకపోవడం.
నన్ను నీ ముందు శప్త ఎడారిగా విస్తరిస్తుంది

నీకై నేనున్నాన్న విశ్వాసం నీకు వ్యక్తం చేయలేని
ఈ శమన వికలత్వాన్ని సమాదరించి
నువ్వే భరిస్తున్నావు. అది చాలు దేవతా!

✻

('ఆంధ్రభూమి' దినపత్రిక 'సాహితి' 5 ఏప్రిల్, 2004)

# అమావాస్య తిమిరావళి

చుట్టూరా వున్న వెలుతురులో
బహిర్గతం కావడం కంటే
ప్రయత్నించి ఎలాగో అలాగ
కొంచెం చీకట్లోకి చొచ్చుకుపోవాలని
నేటి మనిషి ఆరాటం

చీకటంటే వీళ్లకి ఎంత ఇష్టం
రాత్రించరత్వమే రమ్యం
పబ్‌లు, క్లబ్బులు, బార్లు, దార్లు
నేటితరం ఇష్టాలకు జోహార్లు

బ్లాక్ బ్యూటీ అని ముద్దుగా పేరెట్టుకుని
చీకటడ్డాకనే సరదాల చిందులేసే
విందులూ, పొందులూ చూసే
విచ్చలవిడి సంస్కృతి విచ్చుకుందిప్పుడు
బయటేకాదు లోనా చీకటే
అంధకారంపై అంతులేని మమకారం
"ఆరిపేయవే దీపమూ' అన్న ఎంకిపాట
ఎంతో ఇష్టం మరి
అన్నీ బ్లాక్‌లో కొనడంలోనే మోజు
సినిమాటిక్కెట్టు దగ్గర్నుంచీ మొదలు

నల్లధనమే గొప్ప సంపాదన
వైట్‌లో ఇవ్వడం గురించి అడగరెవ్వరూ

నిజమే వీళ్లు దీపావళి కన్నా
అమావాస్య గురించే ఆరాటపడతారు
అమావాస్యనే ఆరాధిస్తారు
చుట్టూరావున్న చీకటిని నిందించరు
ప్రయత్నించి చిరుదీపం వెలిగించాలన్న
నియమం సహించరు
నరకాసురులే కాకున్నా 'నకరా'సురులే కాగోరుతారు

నిజమే కొవ్వొత్తులు ఆర్పుకుని
పుట్టినరోజులు జరుపుకునే సంస్కృతి
నరనరాన జీర్ణించుకున్నాక
దీపావళే అమావాస్య నాడయ్యాక
కటి, చీకటి కమనీయమయ్యాక
నల్ల కళ్ళద్దాలే చూపుకు
శిరోధార్యమయ్యాక
నల్లబ్యాడ్జిలు, బ్లాక్‌డేలు
చైతన్య సంకేతమయ్యాక
చెంగలించేది చీకటి కాక మరేమిటి
కుత్సితమతికి, కృత్రిమ గతికి
రవితేజమ్ కవితేజం భయహేతువు కాదేమిటి?

✻

('సాహితీతేజం', నవంబర్ 2007)

# కొత్తపువ్వులు శ్వాసిస్తాయి

పందెం వేయలేని ఆటలో
ప్రత్యర్థికీ ఆట ఒడుపు తెలిసీ
పైగా సవాలు చేసినట్లు స్పందిస్తే...
అమ్మో
సుఖం గురించి తెలిస్తే, సుఖం కోసం కాంక్షిస్తే
సుఖపెట్టాల్సిన బాధ్యత భరించడం ఎలా?

ఈజిప్టు కైరో మద మృగమా
స్పర్శానురాగాన్ని ఆలపించే తన్మయాంతరాళంలోని
మృదుశకలాన్ని తాకి చూడలేని క్లీబతనమా
వెన్నెల వేడెక్కిన వయొలిన్‌ను
పరిమాణ దండం కమానై స్పృశించలేక
గుడిలోని మూలవిరాట్టునే పెకిల్చి
తానే ఆమెకు దైవమని విర్రవీగే రాక్షస
హంతక కిరాతకమా

పదేళ్ళ లోపు పసిమొగ్గల్లోని
సుఖ కేసరాన్ని కత్తిరించే మగపిరికితనపు
పరాకాష్ఠ నీది
పురుషాహంకార పరాకాష్ఠ నీది

రక్తహీనత వల్ల చెలరేగిన
నీ రక్తపిపాస అంతమయ్యే వరకూ
నేడు ఖండిత మౌతున్న గుహాంతరాళాల బొడిపెలే
అణువులై విస్ఫోటించి
ప్రళయాగ్ని కీలలవుతాయి

పాటగత్తె కాదు వేటకత్తి నీకు గురి
విషపు తేనెటీగవు నువ్వు
రేపటి ప్రపంచం తోటలో
నిన్ను నియంత్రించి శాసించే
కొత్త పువ్వులు శ్వాసిస్తాయి
ఇక తప్పదు.

✻

(ఈజిప్టు కైరోలో ఈనాటికీ సాగుతున్న క్లిటోరిస్ తొలగింపు కిరాతక చట్టం గురించి చదివి)

('ఆంధ్రభూమి' సచిత్రవారపత్రిక, 28 జనవరి 1999)

# వివరణం

కవి బ్రతికిన క్షణాలు అర్థం కాకపోయినా
కవి మరణించాడని అర్థం అవుతుంది

మరణం కవిత్వమంత జటిలం కాదు.

మెదడుకు మృత్యువు
హృదయానికి కాదు

బుద్ధితో ఆలోచిస్తున్నంతసేపూ
అంతా గొప్పగానే వుంటుంది
మేధ తీరే అంత

ఎద విప్పినవాడే
ఎల్లప్పటికీ చెల్లుతూంటాడు.

జీవితం సంక్లిష్టమే కావచ్చు
అర్థం చేసుకోవడానికి సహకరించేదే సాహిత్యం

వయసు పెరుగుతున్న కొద్దీ
అనుభవం బలపడుతున్న కొద్దీ
బ్రతుకు పాషాణ పాకం
ద్రాక్షా పాకం కావాలి
ఒక తాత్త్వికత పండాలి

ఎంత కప్పిచేప్పేవాడు కవి అయినా
ఆ కప్పు నీడనివ్వడానికే గానీ
నెత్తిన కూలడానికి కాదు.

కవిత్వం వెచ్చగా హృదయాన్ని కప్పుకోవడానికి
పరస్పరం భావాలు విప్పుకోవడానికి
సంక్లిష్టతల నుండి తప్పుకుని
సమస్యలు సునాయాసంగా వొలుచుకోవడానికి
జీవనం వికాసవంతంగా మలుచుకోవడానికి

మార్మికత మనిషికెందుకు
చావుపుట్టుకలు రహస్యాలా
బ్రతుకుకెందుకు రహస్యం
రహస్తంత్రిని తెంపడమే ముఖ్యం

మానిషాద నుండి మో నిషాదం వరకూ
బాధ పెట్టడానికి కాదు, బాధ తీర్చడానికే కవిత్వం

ఉల్లిపాయ పొరలు విప్పినట్లుగా
క్రమక్రమంగా అంతా ఒలిచేయడమే
కవి చేసేది

ఉల్లి తరిగినప్పుడు కన్నీళ్ళులా
కవిత్వం ఒలుచుకున్నప్పుడూ
పఠిత సజల నేత్రుడవ్వాలి
మెదడును కాదు చింపుకోవలసింది
కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడినట్లు
అనుభూతి హృదయాన్ని ఆవిష్కరించాలి.

ఏకో రసః కరుణ ఏవ
సాంత్వనమే సాహిత్యం త్రోవ

✻

(12.9.2011)

# గణతంత్రం

మథించే సముద్రంలో
ముందు విషమే విషయం
దిగమింగే శంకరమే శివం
సత్యం ఎప్పుడూ సత్యం

పంపకం కోసమే పట్టుదల
కష్టం సమానమే అయినా
ఫలితం యోగ్యతలబట్టి
నియంత్రించడానికి
ఒక నిర్ణాయక మోహిని

అమృతం అందరికోసమున్నా
అయితేనేం!
ఎవరు అసురులో
ఎవరు అనిమిషులో
ఎంతెంత, ఎవరికెవరికి,
ఎప్పుడప్పుడు, ఎలా దక్కాలో
అంతా చక్రం తిప్పే విష్ణుమాయ

అయిదువేళ్ల సమానత్వ సామెత
కాలం కవ్వం ఎంత కవ్వించి
చిలికినా

చిలికి చిలికి గాలివానలు తప్పవు
గాలివానలో వాననీటిలో
పడవ ప్రయాణాలూ తప్పవు

అగణిత సుగుణ సంధానం
ప్రభుత అనుసంధానం
ఎప్పటికయినా గెలిచేది గణతంత్రమే
రణతంత్రం కాదు.

*

('ఆంధ్రభూమి' సచిత్ర వారపత్రిక, 4 ఫిబ్రవరి 2010)

# రాత్రి నిద్ర

పగటి పూట కష్టం
రాత్రి నిద్రగా ఫలించాలి.
నిద్ర –
స్వప్నాలు ఆరవేసుకునే దండెం కాదు,
శ్రమను ఉతికి ఆరవేసుకున్న
విరామానుభవ వస్త్రం
రేపు శ్రమించడానికి సిద్ధం చేసుకున్న
రక్షణ కవచం.

ఫలం దక్కకున్నా
కంటి ఓదార్పే కాదు రుమాలై –
దక్కిన మేరకు
సంతృప్తి కంబళి కప్పుకున్న వెచ్చని స్థితి – నిద్ర.

కలలు కనడం గొప్పకాదు
కల కష్టంగా ప్రతిఫలించి సాకారమవ్వాలి
కలతపోవాలే తప్ప –
కష్టానికి వెరచి, ముసుగుతన్ని ముడుచుకోకూడదు – నిద్ర

గుండె మీద చేయి వేసుకుని
కంటినిండా నిద్రపోయేవాడే భాగ్యవంతుడు
కలలురాని నిద్రే అసలుకి కమ్మనిదైనప్పుడు –

కలగనాల్సిన స్థితేలేని పరిశ్రమతో –
అలసి సొలసి నిదురించేవాడే స్థితిమంతుడు.

శ్రమ స్వేదం
శ్రమ రుధిరం
నిజమైన శ్రమ శరీరానిది
మనసుపెట్టి, బుద్ధివాడి, కరచరణ విన్యాసంగా
వపువు వడలకపోతే –
శ్రమ పుష్పం పరిమళించదు.
శ్రమ పుష్ప ఫలమే అను నిత్య నిద్రాసుఖ సంపద.

నిద్ర ఒక సన్నిధి
కొద్దిసేపే అయినా తన్మయపరచి –
అంతరాంతర జ్యోతిస్సీమల్లో హాయిగా విహరింపజేసే
పరమాప్త నిధి
కష్టజీవి పెన్నిధి.

*

('నేటి నిజం' మేడే ప్రత్యేక అనుబంధం 2006)

# ఇచ్చుట మాత్రము...

పోయరాదు
ఉద్యోగానికి దానికీ ఏం సంబంధమో

ప్రశ్నించడానికి రొఖ్ఖం రాబట్టే
ప్రజాప్రతినిధుల షుగర్ రోగ కాలంలో
యువను ఆక్రమించేది
నిరుద్యోగ భూతం
మాతృభాష చదువు
ఉద్యోగానికి పనికిరాని ఆశనిపాతం

పనిచేసే చోట
రసాయనాలు పడతాయో లేదోనని
వంద మూత్ర పరీక్షలతో
ఉద్యోగాహ్వానాలట!

పెట్టబోయే కంపెనీ పెడతారో లేదో తెలీని చోట
దళారులు పుట్టిస్తున్నవి మాత్రం పెట్టుబడులు
దారిద్ర్యంలోకి మరింతగా
మురికివాడ ప్రజల నెట్టుబడులు

నిరుద్యోగుల సంఘటిత శక్తి
రాజ్యహింసకు భయపడి
కాళ్ళు తడుపుకోవడం కాదు
అసమర్థ ప్రభుత మూత్రం పోయించాలి
ఉచ్చల జలధితరంగా..
లలో
అవ్యవస్థ సమూలంగా కొట్టుకుపోవాలి.

*

('విశాలాంధ్ర' దినపత్రిక సాహిత్యానుబంధం, 27 ఫిబ్రవరి 2006)

# జల ప్రయాణం

యాంత్రికంగా పరుగెత్తే బ్రతుకునది
ఎప్పుడయినా
ప్రవాహంలో ఒక మలుపు
రాళ్లకు ఢీకొని పారిపారి
ఒక చెట్ల గుబురుల్లోంచో
మైదాన మధ్యంలోంచో ప్రయాణించడం
ఎంత ఉపశమనం!

దూరదూరపు పాయలు దగ్గరై
నదీప్రయాణంలో శ్రుతికావడం
ఒంటరితనంలో విన్పించిన
ఎంత చక్కని బృందగానం

పాయలూ, కాల్వలూ బంధువులే
నదిలాంటి సామూహిక నీటి బిందువులే
ఎవరయినా కానీ
కలివిడి ఒక ఆనందం
కలబోతలో ఒక సుఖం
ప్రయాణంలో ఒక సంతోషం

నీళ్లను కన్నతల్లి మేఘం కాదు భూమియే
మేఘుడు జనకుడు

ఒక మెరుపు మెరిసి, ఒక పిడుగులా గర్జించి
నేలను తన వర్షంతో తడిపి
తరింపజేసేది అతగాడే

గర్భానదాల్చి
పాయలుగా, కాల్వలుగా, సరస్సులుగా, నదులుగా
సముద్రంగా కన్నది భూమి
అన్నీ నీటి బృందమే
పేరు ప్రతిష్టలను బట్టి సంపన్న నామం

ఇంతకీ
ప్రయాణం గురించి కదూ చెబుతున్నది
పట్టాల రెప్పలమధ్య
కనుగుడ్డులా కదులుతున్న
చెమ్మగిల్లిన రైలు
చూపు అంటే ప్రయాణమే
ప్రయాణమంటే దృశ్యాల చలనం
మానవీయ భావనల
జలధార కర చాలనం.

✻

('నవ్య' వారపత్రిక 20 అక్టోబర్ 2004.)

# సంకల్ప స్పందనం

నీకేం బాధ్యత లేదనే
హక్కే నీకుంది అనుకుంటావు
ఇవాళ నువ్వు అనుభవిస్తున్నది
నీవు పుట్టక ముందటి చరిత్ర అని అంటావ్.

చరిత్ర నీ సంకల్పం కాదు.
ఉట్టినే తేరగా నీకు అందివచ్చినది
నీ హక్కని మాట్లాడటం నీ తెలివి.
రక్తాలు ఓడ్చినవారు, జైళ్లల్లో మగ్గినవారు
తామ్రపత్రాలుగా, అయిదెకరాల భూములుగా మాత్రమే
మారిపోయారనే నీ విశ్వాసం.

నీకు కృతజ్ఞతా లేదు.
అప్పుడు పుట్టనందుకు ఆనందిస్తావ్
ఇప్పుడు నీకు కొత్త నినాదమూ నచ్చదు.
పావురాళ్ళ కోసం ప్రాకులాడిన వారిని వదలి
గ్రద్దల వెంటబడ్డ పెద్దల ప్రాపకం కోసమే
నీ ప్రాణ జ్వలన మంతానూ!

ఆ కర్ర పిల్లవాడికి పీచుమిఠాయి చుట్ట
ఇచ్చేదిగా తప్ప ఆనదు.
మూడు రంగుల ప్రతీక పాఠాలు చదివీ చదివీ
నీ మూడ్ ఎప్పుడో పోయింది.

సంస్కృతి అంటే విదేశంలో చెలామణీ చేసుకునేదేగానీ
ఉన్న గడ్డ మీద గుడ్డలు ఊడదీసుకోవడం సబబే నంటావ్
అలాగని వేమన ఆదర్శం కాదు.
ఆలకించేది తిరగేసిన మనవే!
వంటబట్టింది తవ్వితీసిన మనువే!

బాధ్యత సరే –
కనీసం నీకు బాధయినా లేదే!
ఎవరెవరో నీ తల్లి దేహం మీద పాదం పెడుతూంటే
సహనం పేర నీవు పిరికిపాలు తాగుతున్నావనేనా
నీకు తెలుసా?
కనీసం సాటివాడు వేసే కేకలయినా నీ చెవికెక్కవేం

నీకు ఒక ఉన్మాదం ఉంది
అందుకే అభిమతం వదలి మతాన్ని లాగుతావ్
హీనమైన పాపంలా దేశభక్తిని తలుస్తావ్
పిడికిలెత్తినవారిని ముష్టివాళ్లంటావ్
కదంతొక్కినవారిని కాందిశీకుల్ని చేస్తావ్
వలసపోయేవారి వెంటే నీ వలపు
దిగుమతుల సంస్కృతే నీ పిలుపు
జాతీయత అంటే జాగృతం కాలేవు కానీ
హిందూత్వ అంటే ఉలికి పడతావ్

నీకు స్వేచ్ఛకావాలి, స్వాతంత్ర్యం కావాలి, హక్కులు కావాలి
నీకు నీ దేశాన్ని తిట్టే స్వేచ్ఛ కావాలి
విదేశాలకు డబ్బుకోసం తరలిపోయే స్వాతంత్ర్యం కావాలి
దేశభక్తి అన్న మాట
నీ బాధ్యతగా ఎవరూ గుర్తు చేయని హక్కు కావాలి

నిజమే
సిగ్గుబిళ్ల జారవిడుచుకున్నవాడివి కదా

నీకు తల్లి
పాలివ్వడానికీ, పాలించడానికీ, పెంపుచేయడానికీ మాత్రమే
ఆ తర్వాత తను ఏరిపారవేసే
కూరలోని కరివేప, బియ్యంలోని మట్టిబెడ్డ,
నమస్తే అనయినా అనమంటావా బ్రదర్
జైహింద్ అంటే అర్ధమౌతుందా
వందేమాతరం కేవలం సంస్కృతంగానే సంభావిస్తావా
మా తుఝే సలామ్ అంటే మనసుప్పొంగుతుందా
నీకేం హక్కులేదనే బాధ్యతగా చెబుతుంటే
కోపమే వస్తుంది మరి.

సర్లే కానీ! నీ కోపం కొంచెం రక్తవర్ణం కానీయ్
ఈ దేశం నేలమీద పచ్చని పైరుని అలాగే శాశ్వతం చేసే
ఒక హరితవర్ణం విస్తరించనీయ్
శుభ్ర ధావళ్యమైన మనస్సును క్రమేపీ సృజించుకో
నీ గుండెల్లో ఇకనైనా ధర్మచక్రం తిరగనీ
దేశం నీకేమిచ్చిందని కాదు
దేశానికి నీవేమిచ్చావని క్షణం ఆలోచించు

అనుక్షణం దేశభక్తి అని పలవరించమనడం లేదు
ఒక దీక్షగా, ఒక కర్తవ్యంగా, ఒక బాధ్యత గల పౌరుడిగా
నేను భారతీయుడిని అని గర్వించు
ప్రపంచం గర్వించే పౌరుడిగా జీవించు
దేశభక్తి ఒక వ్యూహం కాదు.
ఆలోచనకన్నా కనీసం అనుభూతిగానైనా గుర్తించు.
హృదయస్పందనతో వర్తించు.

*

('నేటి నిజం' దినపత్రిక గణతంత్ర దినోత్సవ ప్రత్యేక అనుబంధం – 2003.)

# గేమ్స్ ఆడకు నువ్వు!

నువ్వు రెచ్చిపోయినంత మాత్రాన
ఆటగాళ్లు విచ్చుకోరు
బ్యాటు, బంతి సమాగమంలో
పరుగుల పిల్లలు పెరగడానికి
నువ్వేమీ వయాగ్రావి కాదు

ఓ క్రీడాభిమానీ! కిరికెట్టు వీరాభిమానీ!
అగ్రహోద్రేకాలతో ఊగిపోవడానికీ
కేరింతలు, చప్పట్లు, ఈలలు, గోలలు, నీవేవీ
మంత్రాలు కాదు
మంత్రాలకు పరుగుల చింతకాయలేమీ రాలవు
చింత కాసింత నిగ్రహించు!

కాసింత ఓర్పు – కాసింత సహనం అవే కరువా?
ఓటమికి కాదు
ఓటమికి పరిహసించటం ఓటమి
అన్ని రంగాలలో ఉండాల్సింది పోయి
క్రీడాస్ఫూర్తి ఆటల్లోనే అరటిపండు పిసుకుడైతే ఎలా?

వెన్నిచ్చిరాలేదు కదా
పసుపూ గాజులూ తిక్కన్న స్నానానికి పెట్టేందుకు!

దిష్టిబొమ్మల దగ్ధం
ముఖచిత్రాలపై బూటుకాళ్ళ త్రొక్కిసలాట
ఆట అంత అనాగరికమా!
గెలుపు ఓటములు సహజాతాలైన చోట
కృంగిపోవడం, పొంగిపోవడం
ఏదయినా – అమానవీయతకు లొంగిపోవడం

బరిలో నువ్వుంటే తెలుస్తుంది!
వాళ్ళ కాలిబర్‌ను నువ్వనుకునే గురిలో చూసి
తప్పిందని బరితెగించడం తప్పిదం
మగటిమి చూపాలని ఒహటే పోటెత్తిపోతున్నావ్
క్రికెట్టూ, రతీ ఇవేగా నీ ఏకైక క్రీడలు
వాటిల్లో సోకినంత మాత్రాన క్రీనీడలు
ముచ్చెమటలు నీకెందుకు ముచ్చట్లుగా పట్టడం?

వాళ్ళ శక్తియుక్తులతో, బలాబలాలతో వాళ్ళ ఆట వాళ్లని ఆడనీ
గెలిచినా ఓడినా వీరుడు వీరుడే
క్రీడాకారుడు క్రీడాకారుడే.
క్రీడని పేడి అనకు, అనుకోకు.
అదనుచూసే అర్జునులు విజృంభిస్తారు
తప్పటడుగులు పడినా తమశక్తితో
వజ్రాల బంతి వశం చేసుకోవడానికే తపిస్తారు
మైదానంలో గురిచూసే బరిలోకి దిగుతారు

ఆటను ఆటగా ఆటగాళ్ళనే ఆడనీ
క్రీడాస్ఫూర్తి కొరవడి వేటగాళ్ళ దర్టీగేమ్స్ నువ్వాడకు.
నువ్వాడకు – నేనీడకు
మన జట్టు స్ఫూర్తి, కీర్తి
ఇక ప్రపంచ కప్పుకు.

*

('ఆంధ్రభూమి' దినపత్రిక, 29 మార్చి, 2007)

# వరదాక్షరం

వరద-జలరూపమే. కాదేమీ భ్రమ
ప్రళాయకృతి సంభవ సంభ్రమ
బురద రాజకీయంగా
అంతకుముందుగానే విభ్రమ

ముంపు నుంచి నిజమే ఓ కంపు
కానీ ఛిద్రమానవ సంబంధాలను
సేవా తత్పరత పేర అదే దింపు, ఒక సొంపు

నదులు ముంచెత్తడం మాటేమోగానీ-
పంటకాల్వలవెంట పరీవాహకమవ్వాలని
ప్రతిష్ఠించిన ప్రాజెక్ట్‌ల కొన్నిటి చందం
ఇన్‌ఫ్లోలు ఔట్‌ఫ్లోలు కారణమై క్యూసెక్కులు క్యూసెక్కులుగా
ఊళ్లు మునిగిపోవడం విషాదం.

జలయజ్ఞ దైవకుమారుడు
నేలను పవ్వళించి నెలతిరగ్గానే-
జలప్రళయం జనించడం
ఏ ప్రకృతి రోషకషాయిత నేత్రరోచిస్సో!
ఇది ఏ తప్పిదాల అజ్ఞానాంధ తమస్సో!

అక్కడ వరదల్లో విలవిల్లాడుతున్న వారితో బాటు
ఛానెల్స్ పుణ్యమా అని

మననట్టింట్లోకీ చర్చల వరద, రిపోర్టింగ్ సరదా
రాజకీయం బురద ముంచెత్తి
దృశ్యమాధ్యమ శ్రవణోత్పాతాలతో మరింతగా
గిలగిల్లాడింది హృదయం.
మీట నొక్కితే తెరపై ఆవిష్కృతమైనది భయం.

నీరు కన్నీరై తరగలెత్తింది
కృష్ణా, తుంగభద్ర గేట్లు తెరుచుకుని
శ్రీశైలం, మంత్రాలయాల మీదుగా పరుగులెత్తింది
కొన్ని జిల్లాల్లోని వరద నిరంతర ప్రసార అలలవరుసల్లో
ఛానెల్స్‌లోంచి రాష్ట్రమంతటా కరుణై ముంచెత్తింది
అసలుకు మించి కూడా హడలెత్తించింది

ప్రాణాధార హృదయాంతరంగ గంగవున్న
శివుడి జటాజూటాన్ని అనవసరంగా
ఏ భగీరథులు విడగొట్టారో
గోత్రభిదాయుధులై
ఎవరు కాపాడే కొండరెక్కలను పడగొట్టారో
సాఫీగాసాగే ప్రవాహాలను నిరోధించి
జలదిగ్బంధనం పేర
చెరువులను, కుంటలను ఎండగట్టి
భవంతులు నిలబెట్టి, నదుల అనుసంధాన తొడలుగొట్టి
సజావైన ప్రకృతి శక్తుల ఉనికికి అధికారాంధులు
సవాలుచేసి అసమతుల్యతల కాలరెగరేస్తే కాదా
కాలమైందిక కడలి ఉగ్ర పంజాల దెబ్బలకాలవాలం.

అయింది ఎలాగూ అయ్యింది
ఆదుకునే పేర ఇప్పుడు
ఆపన్నహస్తాలు పన్నగవిషమస్తకాలై
వరదరాజులుగా మారేవారి
అవినీతి అక్రమాలపై నిఘా వేయాలి.
వరద బాధితులకు సహాయాల పేరిట

దగాలకు దిగే సంస్కార దరిద్రులను
కనిపెట్టి, పనిపట్టి
అసలు సిసలు, కరకట్టలు నిర్మించాలి.
'పుండొకచోట మందొక చోట' తీరుగాక
కన్నీటి నేత్రస్థలినే ఓదార్పు విరళమవ్వాలి

పార్టీల పౌరుషాలుకాక
బ్రతుకు పరుషాలు కుదుటపడి సరళమవ్వాలి
కలం చుక్కైనా కరుణ రెక్క విచ్చి
ఆర్తుల ఆసాంత సాంత్వనమవ్వాలి తప్ప -
కవిత్వమైనా వరదై, దురదై, బురదై
శ్రోతృజన హృదయ పంకిలం కారాదు.

వరదబాధితులకు
మానవత్వమే అభయహస్తం
కవిత్వం వరదహస్తం
అందరికీ మేలు ఒనగూరాలనే మన
ప్రణవం గూరి ఆశయ సమస్తం.

*

('ఆదివారం ఆంధ్రప్రభ' 29 నవంబర్, 2009)

# ఎగాదిగా ఉగాది

కాలకన్య
భూ, నభాలనే రెండు పెదవుల మధ్యా
ఇప్పటి ఈ చిరునవ్వుల వెన్నెలపేరే
సర్వజిత్ ఉగాది.

సర్వమూ జిత్తులే నేడు
ఎత్తులూ పై ఎత్తులే అంతటా చూడు!
ఈ సమాజం, ఈ అభ్యుదయం
అంతా ఎగుడు దిగుడు!

ఏడ్వలేక నవ్వడమే
ప్రతిభావంతుల స్థితి,
కనకపు సింహాసనాలపై
శునకాలదే అధికారమనే దుస్థితి.

కోకిల ఏం కూసినా చెల్లుతుంది
కాకి అరిస్తే మాత్రం గోల!
చూతపల్లవాలు పరభృతాలకు.
నువ్వులొదిలిన పిండాకూళ్ళు,
అధిక సంఖ్యాకులైన కాకులకు.

కాల పరిహాసాల్లో
ధీరత్వాన్ని కోల్పోకూడదు

పంచమస్వర పరవశంలో
వేదనాదం విస్మరించకూడదు

సర్వజిత్‌లో జిత్తులు కాదు
చూడాల్సింది
'చిత్' స్థితిమంతమైన
విలువల ప్రోది.

మానవీయ విలువల మహోన్నతికే
మనకీ అమ్ములపొది
ఆనందం జీవధారై
నిండాలి అందరి హృది.

*

('ఆదివారం ఆంధ్రప్రభ' 18 మార్చి, 2007)

# హృదయం

ఎక్కడో ఒక చోట ఎవరినో ఒకరిని
చూడగానే వేగంగా కొట్టుకోదా
ఆ వేళ కోసం ఎదురుచూడాలి

ఎవరో ఒకరు ఎపుడో ఒకపుడు
దోచుకోకపోతారా
అంతదాకా స్వచ్ఛ పదిలంగా ఉంచాలి

ఇది రక్తనిధి అద్దాల కాసారమే
శరీర సజీవకోశమే
అంత మాత్రమే కాదు రసానుభూతి పుష్పం
అర్పించడానికీ, అర్చించడానికీ
ప్రణయమో, ప్రణవమో
నిర్ధారించుకోవలసింది నీవే!

జీవితం చిన్నది, ఆశ పెద్దది
ప్రేమ అగాధ జలధి, భక్తి ఉన్నత శిఖరం
వీటిని ఇముడ్చుకున్నదిది
ముదముతో భాసించినా, మదముతో ద్వేషించినా
అనుభూతితో స్పందించినా
అస్వస్థమై కుదించినా ఇది ఇదే!

అవును! హృదయం
మనిషి బ్రతుకు సూర్యోదయం
గాయమైనా గేయమైనా అది
సవ్యం, నవ్యం, భవ్యం,
అమృతాక్షర కావ్యం.

✻

('ఆంధ్రభూమి' సచిత్ర వారపత్రిక, 16 ఫిబ్రవరి 2006.)

# ఆమె(రి)కా పూలు

నూరు పూలు వికసించనీ
అంటాం మనం
నాకూ సమ్మతమే అంటాడు వాడు.

మన దేశం పూలతోటలో
ఏ మొక్కలు నాటాలో
వాటి మధ్య ఎంత ఎడం వుండాలో
ఏ ఎరువులు వాడాలో అందుకే చెబుతున్నానంటాడు
పోనీలే అనుకున్నామో –
పూలరంగునీ, పరిమళాన్నీ కూడా శాసిస్తాడు.

పుష్పవిలాపాన్ని బేఖాతరు చేసి
గ్లోబలీకరణ ఊలుదారాలతో
గొంతుకురి బిగించి
గుండెలో నుండి సామ్రాజ్యవాద సూదులు గ్రుచ్చి కూర్చి
వర్ధమాన దేశ సుమాలను
తన ఆధిపత్యపు కురులలో ముడుచుకోజూస్తాడు
అందులో అచ్చంగా ఆడువాడు వాడు
కానీ ఆడించేవాడిననుకుంటాడు.

స్త్రీలను గౌరవించే మనం
అమెరికానూ గౌరవిస్తున్నాం

పువ్వుల్లాంటి మన 'ఆమె'లనూ తన
సంస్కృతీ ప్రభావంతో
'ఆమె'రికన్లుగా మలుస్తున్న కుట్రవాడిది

అందుకే ఇవాళ సాధించడంలో, శాసించడంలో
ఆడది ఆడదే
అమెరికా అమెరికాయే

✻

(స్త్రీల స్వేచ్ఛకూ, స్త్రీవాద చైతన్యానికీ అమెరికాయే ఆదర్శమన్న ఓ ఫెమినిస్టు భావజాలం గమనించి)

('నవ్య' వారపత్రిక. 1 ఫిబ్రవరి, 2006.)

# సమర సమీరంలో ...

వసుధైక కుటుంబానికి
తన చమురుతో తలంటే ఇరాక్ తల్లిపై
పురుషాధిక్య ప్రపంచపు మొగుడిలా
వాడి అహంకారం
పెత్తనం అంతా తనదే కావాలన్న అభిజాత్యం డేగ
ఇనుపరెక్కలు విసిరి
మానవత్వం కోకిల గొంతు నులుముతోంది.

స్వభానును స్వభావానుగుణంగా
కాల రామణీయకతతో రానీయక
కర్కశంగా కాలరాస్తోంది.
ఈసఫ్ నీతి కథల సారం బుష్ హుంకరింపులు
ఈసడించుకుంటున్నాయి
అరేబియన్ రాత్రుల శృంగారం కావాలి గానీ వాడికి
ప్రజాస్వామ్య ప్రమదను ప్రమిద వెలిగించి
ఇంటికి దీపం ఇల్లాలుగా గౌరవించడం మాత్రం చేత కాదు.
గుమ్మాలకు మిస్సైల్స్ అలంకరిస్తాడు గానీ
మామిడి తోరణాలు ఎరుగడు వాడు.
కవిగానాలేవయినా తనకు భట్రాజు పొగడ్తలు కావాలే తప్ప
వేలెత్తి చూపితే కోట్లతో కన్నెర్ర చేస్తాడు.

ఇంతకీ పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాల పిచ్చి
యుద్ధోన్మాదం కాక మరేమిటి?
ఇంతకీ అసలు పిచుకలు చేసిన పాపం ఏమిటి?
పొద్దున్నే పిల్లా పాపల సందడుల పండుగ వాతావరణపు నట్టింట
ఆనందపు కిలకిలరావాలు చేయడమే కదా!
ఆ చిన్ని గొంతుకుల కలస్వనాల్లో కండ కావరం ఏమీ లేదే!
ఆ గూళ్ళు తన ఇంట అలంకారమే కానీ ఆయుధాలేమీ కావే!
ప్రకృతి సిద్ధంగా రెట్టవేసినా గిట్టక మట్టి కరిపిస్తానని
అట్టహాసం చేయడం ఏమిటట?

ప్రేమికుల రోజు సంస్కృతిని
ప్రపంచ వ్యాప్తం చేసే అగ్రరాజ్యం
ఉగ్రవాదం అణచివేత పేర
తాను చూపుతున్నదే ఉగ్రరూపం అని వివేకం పొందదెందుకో

ప్రేమించడం చేతకానివాడే ద్వేషిస్తాడు.
దేహాలదే కానీ ప్రేమ దేశాలది కాదనుకునే వాడు గర్విస్తాడు.

గాలిలో ముద్దులు విసిరేవాడు-
నేలన హద్దులు గీసి,
తను గీచిన గీత దాటరాదని పిడిగుద్దులు గుద్దుతాడు.
విధ్వంసం తర్వాత పునర్నిర్మాణానికి కోట్లు కేటాయిస్తాడు గానీ,
అసలు యుద్ధమే వద్దనుకోడు.

తను అనుకున్న మాటల, చేతల మెలికలే మెరికలనుకునే
వాడిది
కామర్లె రోగి లోకపు పచ్చదనం కాక మరేమీ కాదు.
పిచ్చి కుదిరి రోకలి తలకు చుట్టి
ఆ రోకలితో పచ్చడి చేసే
వేపాకు వెర్రిదనం కాక మరేమీ కాదు.

తానే కాలపురుషుడిననుకుని
అకాల యుద్ధ మేఘాలు ఆవరింపజేస్తున్న అమెరికా చీకట్లను
పటాపంచలు చేసే ప్రపంచ ఏకీకరణం జరగాలి.
అంతా ఒక్కటై ఆ ఒక్కడి అహంకారాన్ని నిలువరించే
ప్రజాస్వామ్య సూర్యుడు ప్రభవించాలి.
ఉగ్రవాదాలు, అగ్రవాదాలు అంతరించి
సమగ్ర శాంతి పల్లవాలు చివురించాలి.
మానవత్వంకోకిల కంఠం సవరించాలి.

వరల్డ్ కప్ మనకు రాకపోయినా ఫరవాలేదు
వరల్డ్‌గ్రిప్ మాత్రం డాలర్ డేగ కబంధ హస్తం పాలు కారాదు.

*

('ఆంధ్రభూమి' దినపత్రిక 'సాహితి' 7 ఏప్రిల్ 2003.)

# ‘నరా’వతారం

సుఖంతీపు ఆరవేసే తీగా ఇదే
బాధా సుమం పెనవేసే లతా ఇదే
దేహమంతా దారులుగా విస్తరించి
రక్త చైతన్యాన్ని రవాణా చేస్తున్న ప్రాణవ్యవస్థా ఇదే

ఒకరి నాలుకవద్ద తెగి చెవుల్ని పోటెత్తించేదీ
ఒకరి కరస్పర్శతో అరచేతనే ఉబ్బి తబ్బిబ్బు చేసేదీ ఇదే
ఓ మెడవంపులో ముద్దాడిన క్షణం అంగరంగాన
రతీదేవి నర్తనాన్ని ఆవర్తింపచేసేదీ ఇదే

దవడ కండరం వద్ద బిగిసి ఆగ్రహించేదీ
కంటి చివళ్ల అదిరి అద్భుతమయ్యేదీ
కాంక్షా సత్తువలో బిగిసి ఫలప్రద తృప్తితో ఒదిగేదీ
ఆలోచనా బీజాలను అణువిస్ఫోటనం చేసి
శాంతినీ, విప్లవాన్నీ పండించేది ఇదే ఇదే

మెదడులో భూగోళమంత వైశాల్యం
హృదయంలో సముద్రమంత అగాధం
బుద్ధిలో ఆకాశమంత సమున్నతం
పొలంలో నాగేటి చాలు
కర్మాగారంలో శ్రామికుడి విన్నాణపు శ్రమవాలు –
నరం.
అవును – నరం.

నరం కలవాడు కనుకే నరుడు
నరం – ఇహం పరం, మానవ పరిణామ స్వరం

హృదయానికేమీ ఢోకాలేదు
మానవీయ స్పర్శ, మమత ఇగిరిపోలేదు కదా!
సంకోచాలూ, చిల్లులూ లేవు
కానీ తలకుమించిన భారాలు తలకెత్తడం వల్లనే
వెన్నెముక ఉన్న మనిషికి
ఎప్పుడో ఎక్కడో సన్నటి నరం చతికిలబడినట్లవుతుంది
అప్పుడు ట్రాక్షనే రియాక్షన్ – ఆత్మబలమే ఎట్రాక్షన్
దిమ్మవమ్మయిపోతుంది

హెర్క్యులస్ భుజం మార్చుకుంటాడంతే
బరువు పరులనెత్తిన వేయడు
వెన్నెముక హృదయమంత మెత్తనిదయినా
హృదయం వెన్నెముకంత గట్టిది
చైతన్యరక్త సంచలన జీవన సంగీత తంత్రి – నరం
మ్రోగుతూనే ఉంటుంది.
లక్ష్యించిన దారి సాగుతూనే ఉంటుంది
'నరా' వతారం ముగియదు.

*

(సెర్వికల్ డిస్క్ సింద్రోమ్ 'వర్టిగో'తో పడిలేచి)

('ఆంధ్రప్రభ' దినపత్రిక 'సాహితీ గవాక్షం', 4 ఏప్రిల్ 1999)

# జలావరణం

ఇవాళ –
నీరు ఒక కల
వ్యాపారపు కళ
పొడారిన నేల
ఆవిరైన జల
మనిషి తల
గట్టిపడ్డ శిల

అవును మరి –
జలధరాన్ని మథించి
మట్టిని తడుపుకోవాలా!
జీవధారలు శోధించి
జీవనం గడుపుకోవాలా!

సునామీలు పోటెత్తినా
గొంతు దాహం తీరని తంతు
వాటర్ వాటర్ ఎవ్విరీవేర్
నాట్ ఎ సింగిల్ డ్రాప్ టు డ్రింక్!

పార్వతినైనా విడిచిపెడతాడుగానీ,
ఇవాళ పరమేశుడైనా గంగను వీడడు.
తానే పట్టి పెట్టుకుని

నీటి వ్యాపారం చేస్తాడు భగీరథుడు
ఎవడు కొల్లగొంటున్నాడు నీటిని?
ప్రకృతి సహజవనరుని
సీసాలకు పట్టి –
అమ్ముకోవడం
కన్నీటి మనిషినే
నీటి కొనుగోలు దారునిగా మార్చడం
ఎవడి జలవిహారం?
గ్లోబల్ ఖడ్గ ప్రహారంతో
ఏమిటీ జనసంహారం?

ఊరు నీరుకు దూరమవడం ఏమిటి?
నీరు నోరుకు అందకపోవడం ఏమిటి?
జలయజ్ఞాలకు జనం సమిధలు కావడమేమిటి?
నీరు ఎలాగూ లేదు కన్నీరు కూడా
పోగొట్టుకోవడం ఎందుకట!
మంచు బిందువున్న ఆకురెమ్మ కంటిచెమ్మ
నీరు కారిపోకూడదుగానీ,
నిరంతర ఆర్ద్రత తడారకూడదు.

దుఃఖాన్ని మాత్రం రానివ్వకు
దుఃఖించే నైజాన్ని మాత్రం దూరం చేసుకోకు
బ్రతుకు కమ్మదనం చూసేందుకూ, చాటేందుకూ
కనుల చెమ్మే చిరునామా.

మనసు బండబారినా,
గుండె తడి ఆర (కూడ) దు!
నీరు మీరు పరస్పరాశ్రితాలు
జనహితాలు జలధరాలు
నెత్తిన నీటికుండలతోనే కాదు,
మనసు మమతల నీటి దండలతో కూడా –
మనిషి ఒక నీటి పుట్ట.

ఉమ్మనీటి నుండి
చితిపై చిల్లికుండ ధారవరకూ
మనిషికి – ఒక జలావరణం
కన్నుల్లో, గుండెల్లో జలధారణం
ఆర్ద్రత ఒక జలాభరణం
జీవితమే – ఒక జలప్రయాణం

✻

('నేటి నిజం' 'జలం' పై ప్రత్యేక అనుబంధం 7 ఏప్రిల్, 2007)

# స్మర వారం వారం...

అక్షరాలన్నీ అనిమిషలే!
అమృతం సేవించిన వాటికి వయస్సేమిటి?
ఏళ్ళు సంపుటీకరణ గణనానికే తప్ప
ప్రతి సంచికా అగణిత రసప్లావితం!

ప్రతి పుటా యంత్రబద్ధమైన
సృజనశీలి తపఃఫలం
చిత్రవర్ణ శోభితంగా అచ్చయ్యేది
తెల్లకాగితాల మీదనేగానీ
అచ్చంగా ముద్రితమయ్యేది
అనుభూతి రసోద్దీపకంగా
పాఠకజన ప్రఫుల్లానంద హృదయాలపైనే!

ప్రత్యక్షర రచనా
లక్ష్మీకళ తొణికిసలాడే
సరస్వతీమూర్తి
ఎద ఎదకూ ఏదో ఒక చేతనాస్ఫూర్తి!
అక్షరాలన్నీ
కవితలుగా, కథలుగా, నవలలుగా
కాలమ్‌లుగా రూపెత్తి
భూమికి స్వాతిచినుకులా నవ్యమై దిగివస్తూంటాయి

పాఠకులను జగదేకవీరులను చేస్తూ
అతిలోక సుందరంగా దర్శనమిస్తూంటాయి!
సంచిక చేపట్టినవాడు అక్షరాలా
అనిమిషులను అక్కున జేర్చుకున్న రసరాజే!
ప్రతి పాఠకుడూ రారాజే!!
ప్రతివారం పుట్టినరోజే!!!

✻

('ఆంధ్రభూమి' సచిత్రవారపత్రిక, 13 జూలై 2006)

# దేవుడు దేవుడే

రూపరహితుడొకడు
ఏకరూపుడొకడు
బహురూపులింకొకడు
ఒకడికి ఒకే నామం
అనేక పేర్లు ఇంకొకడు
దేవుడు దేవుడే!

బహుకాంక్షా ఫలసిద్ధి దేవులాట
చిత్తశాంతి దేవులాట
బహిర్గత కామనలే – ప్రార్థనా స్థితి
ప్రశ్నారాహిత్య విశ్వాసమే
కర్మకాండల గతి
గుడి, మసీదు, చర్చి
ఏదయితేనేం –
తరలివెళ్లే భక్తజనసందోహపు జీవనాకాంక్ష
దేవులాటే!
దేవుడు దేవుడే!

ఏ గంటలు మ్రోగినా
ఏ మైకు గొంతెత్తినా
అది పిలుపు, మేల్కొలుపు

పాపభీతి వలనో
చిత్తశాంతి కొరకో
కాంక్షల నెరవేరికకో
ఆశ్రయింపు
అర్థం చేసుకోగలంగానీ
ప్రార్థనాలయంలో
బాంబు విస్ఫోటనం
భగవంతుడిని భయపెట్టడానికా?
భక్తుల మధ్య చిచ్చు పెట్టడానికా?
కూలు విశ్వాసం కట్టడానికా?

దేవుడిని పిలిచే శక్తేలేని మనిషికి
పేల్చే శక్తి వస్తుందా?

*

('ఆంధ్రభూమి' సచిత్ర వారపత్రిక, 12 జూలై, 2007.)

# ఉన్నది జాగ్రత్త

ఏ నీలి శిలువ
చలువయితేనేం వీధుల నిండా
చిత్తకార్తె సంబరాలు!

పసివాడి బుగ్గ కొరికేదొకటి
పడుచుపిల్ల పిక్క పట్టేదొకటి
తాతగారి ఉదయపు నడకను
రోడ్డే ట్రెడ్మిల్ యంత్రమైనట్లు
జాగింగ్ పరుగులెత్తించేదొకటి

మనుషులను ప్రేమించడం మొదలెట్టి
ఈ తరం కసి ప్రేమికుల్లా
కాటు వేయడం నేర్చుకుని రెచ్చిపోతున్నాయి
విశ్వాసం సంగతి తెలీదు కానీ
ఖచ్చితంగా రేబీస్ మాత్రం వుంది
జాగిలాల జాలీ స్వైర విహారంలో
పౌరుల విలవిల!
మందు లేని భూతదయ?

సంతాన నియంత్రణ ఆపరేషన్లు సరే
ఎప్పటి పిల్లకుక్కో కాదు –
ఇప్పటి తల్లి కుక్కే కరుస్తోంది గదా!

కరిచేవీ, అరిచేవీ అన్నీ కుమ్మక్కై
హిజ్ మాస్టర్ వాయిస్
ప్రాణాంతక మౌతోంది కదా!

బుష్‌గారు తను
ఇండియా అని పేరు పెట్టుకుని ఒకటి
సాకుతున్నందుకు
బుష్ మీదే కాదు
కుక్కలమీదే కోపం రావద్దూ

ఇండియాలో మనిషికన్నా
అమెరికాలో కుక్క బ్రతుకు గొప్పదని
ప్రతి కుక్కా
అమెరికా తరలి వెళ్లేటట్టుంది మరి–
లైసెన్స్ బెల్ట్‌లు విస్తారమైతే
వీధి కుక్కలన్నీ
పెంపుడువై పోగలవా
విశ్వాసాలే కాటు వేస్తున్నాయి నేడు
పిచ్చి పిచ్చపిచ్చగా పెరుగుతోంది.

ఆ ఇంటి ముందు చాన్నాళ్లుగా
'కుక్క ఉన్నది జాగ్రత్త' అని బోర్డు చూస్తున్నాను
కానీ కుక్క ఏదీ కనిపించలేదు
ఆరా తీయగా తెలిసింది–
జాగుసేయక ఓ జాగిలానికి
పాలుపోసి సాకి ఇంట కట్టేసేందుకు
మనస్కరించిన అతగాడు
కన్న తల్లిదండ్రులను మాత్రం సాకడానికి మనస్కరించక
వృద్ధాశ్రమానికి నమస్కరించి తరలించేసాడని

విశ్వాసం కాదు రేబీస్
అని అర్థమయ్యాక–అతగాడి గురించే నేటికీ
ఆ బోర్డు అతి సహజంగా ఉందని
నిర్ధారణ అయ్యింది.

‘కుక్క ఉన్నది జాగ్రత్త’ కాదు
జాగ్రత్త ఉన్నది కుక్క అని
అవగతమయ్యింది.

‘డాగ్’న లగ్‌జావే
అని ఎంత ప్రార్థించి ఏ లాభం?
కుక్క వెంటబడింది...
దయాభూతం ఆవరించి,
మనిషే కుక్క అవుతున్నాడు!

“కుక్కలవలె, నక్కలవలె
సందులలో పందులవలె” .. శ్రీశ్రీ అన్నట్లు
శునక ప్రస్థానంతో మనదీ ఒక బతుకేనా?

*

(‘ఆదివారం ఆంధ్రభూమి’ 27 మే, 2007)

# సరేలే ఇంకొంచెం చిల్లు...

వెలుతు రంటే చీకటి మీద
బ్రతుకంటే మృత్యువు మీద
చీకటి – ఓ పెద్ద వెలుతురు
యుద్ధం చివర
ఇంతకీ ఆలోచించాల్సింది
నువ్వెదుర్కోవాల్సిన మధ్యే మధ్యే యుద్ధం గురించి.

యుద్ధం గడియారంలో
గడియారం గుండెల్లో
గుండె జనంలో!
జనంలో నీ చీకటి
చీకట్లో నీ వెలుతురు
వెలుగు నీడల నడుమ సందేహ ఆశల సందోహం
బ్యాండ్‌మేళం హోరులో ఏక్ తారా
ఏక్‌తారాలో సంగమించిన జనం

మృత్యువు నూరుశాతం చీకటైతే
జీవితాకాశాన
నలభైశాతం పరుచుకున్న
ట్రాన్స్‌పరెంట్ డార్క్‌నెస్ ఇప్పటి బర్త్‌డే వెలుగు.

కొంచెమై చీకటి కమ్ముకోవడం
పూర్తి వెలుగై ఉదయించడం కోసం

తర్కబద్ధ జీవితంలో
నిరాశ – భ్రాంతి వమనం
ఆశ – కాంతి గమనం
ముళ్ల తీగెకు తగుల్కొన మూడు రంగుల చొక్కా
ఆఫీస్ టేబుల్‌పైకి ప్రాకుతున్న పిపీలికం లెక్కా
ఆర్థికం పెంటకుప్ప పక్కన
ఆదాయం చింపిరి విస్తరాకుపై పడ్డ అవసరాల కుక్కా
వెరసి
కాగితం మీద ఒలుకుతున్న కవిత్వం తిక్కా
అంతా అద్భుత పారదర్శక చిత్రం

బాధ రాందాసు చెర
అనుభూతి తోరాతోరా గిరాం గిరగిర
అనుభవం ఎన్‌కౌంటర్ మొర
బ్రతుకు ఓజోన్ పొర

*

('ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రిక జూలై 26 – 1 ఆగస్టు 1995)

# మౌనమే నీ చప్పుడు

ఎవ్వరూ ఏడ్వవద్దు
తండ్రిపోతే కొడుకుంటాడు
వ్యాపారం ఏమీ ఆగిపోదు
షాపు ఎవరూ ఎత్తేయడం లేదు
ఇంకా హంగులతో ఆర్భాటాలతో
చిల్లరకొట్టునే మెగామాల్‌గా
పెంచేయడానికి వీలుంది

తండ్రి కూలిపోతే
కొడుకు 'కూలీ'కి పోతాడనుకోవద్దు
ఉద్యోగం చేస్తూ చేస్తూ ఊపిరాగిపోతే
ఉన్నవాడికి 'కాంపెన్‌సేషన్' ఇవ్వడం
ఆరిపోకుండా కుటుంబాన్ని ఆదుకోవడమేగా
సామాన్యుడికో రూలూ
సంపన్నుడికో రూలూనా
కష్టం ఎవరిదయినా కష్టమే కదా పాపం
తండ్రిని తనయుడు భర్తీ చేస్తానంటున్నాడు

తండ్రి దేవుడు
కొడుకు దేవుని బిడ్డడు
భక్తితో కొలవడమే జనం పని

వడ్డీకి ఋణాలిచ్చి ఆదుకునేదీ
పెయ్యి బాగులేకపోతే మందో మాకో ఇచ్చి
ఆరోగ్యశ్రీలు కురిపించేదీ
చెయ్యీకాలూ ఆడని ముసలితనానికి
సేవచేయలేకపోయినా
వందోరెండొందలో ఇచ్చి
అభయహస్తమయ్యేదీ
పనిచేసే సంస్కృతి పో(గొట్టు)తున్నా
నీకు కష్టం లేకుండా జోకొట్టి
నీ భూములనూ, 'బూమ్'లనూ
తనదిగా ఆదుకుంటున్నది
ఏదీ ఆగిపోదు

విశ్వసించినవాడవు కదా
ఇంక అంతా విడిచిపెట్టు
నువ్వు ఎంత అజ్ఞానివైతే అంత సుఖం
'ఇగ్నోరెన్స్ ఈజ్ ది బ్లిస్'
నీకు బుద్ధి ఎందుకు, ఇంత బువ్వ కావాలి
మాతృభాషలో విద్య ఎందుకు
మా ఛానెల్స్ టీవీల్లో వినోదం కావాలి
వాళ్ళ మేడల సంగతీ మేడమ్స్ సంగతీ ఎందుకు
ఇందరికీ ఇళ్ళు వుంటే చాలు
గుడిసేటి వలసపోని బ్రతుకు చాలదూ

ఎందుకు ఏడవడం
చివరకు ఎలాగూ అంతాపోయేదే
విమానంలోంచి పోతోనేం
వీధి మున్సిపల్ బండిలాగేస్తేనేమి
చావు గురించి చచ్చిన చావు
ఆర్భాటాలెందుకు నీకు
చచ్చు గుండెకాకపోతేను

ఏదీ ఆగిపోదు
ఏదీ మారిపోదు
ఎవరు ఏలుబడికి వచ్చినా
ఇంగ్లీషు నీ బడికి వచ్చినా
పావలా వడ్డీ ఇచ్చినా
అందరికీ మూడు పూట్లా ఉచితభోజనం
అని రేపు సరికొత్త పథకమొచ్చినా
నీ బ్రతుకు నీదే
నీ చావు నీదే

దినపత్రికల వార్తలు
ఇరవైనాలుగంటల ఛానెళ్ళ ప్రసారాలు
కళ్ళల్లో, చెవుల్లో కుక్కుకుని
అధికారం, ధనం, హింస, సెక్సు
కక్కుకుని –
నీ బ్రతుకు నీదే. నీ చావునీదే

ప్రభుత్వమేదయినా నీదే అవుతుందిలే
నీ మీద నీకు ప్రభుత్వం లేనప్పుడు
ఎంత అరచి గీపెట్టినా మౌనమే నీ చప్పుడు.

*

('పత్రిక' మాస పత్రిక, అక్టోబర్ 2009)

# నీటి పంజరం

ఎన్ని వంతుల భూమి
ఎన్ని వంతుల నీరో తెలీదు
మనిషి నీటి మట్టై
మట్టినీరై
ప్రవహిస్తున్నాడని మాత్రం తెలుసు

కశ్మలాలూ, కల్మషాలు పెరిగాక
మొత్తం నీటితో కడగందే ఎలా
అభిషేక జలాలూ ఆవిరి చేస్తే
శిలామూర్తి శుభ్రపడేదెలా

మనిషి దేహ పంజరంలో బంధితుడు
సందేహ పంజరాల బాధితుడు
ఒక వర్షమో,
ఒక హర్షమో పునీతుడిని చేయందే
పురుషోత్తముడు అయ్యేదెలా!

అక్వేరియంలో చిలుక
పంజరంలో చేప
మనిషి ఓ చేప చిలుక
నీటి పంజరపు చేప

నీటి పంజరం పగిలితే
చేప గిలగిల్లాడి ఛస్తుంది
భూమి పంజరం వీడితే
చిలుక ఎగిరిపోతుంది

చేప చిలుక అయిన మనిషి మాత్రం
భూమినీ వదలడు
నీటినీ వదలడు
తనను తనే వదలడు.

*

('చినుకు' మాసపత్రిక, ఏప్రిల్ 2007)

# విలువ

స్థితిని బట్టి మనిషి విలువ
నాడయినా నేడయినా అనడం కుదరదు
నాడు విలువ మనిషికి
నేడు విలువ వస్తువుకి
మనిషే వస్తువుగా మారిపోయాక
విలువలు మార్కెట్ ప్రపంచానివే గానీ
మనిషి వ్యక్తిత్వ ప్రపంచానివి కావు

నిన్నటిదాకా
మెట్లు అలానే నిలిచేవి
మనిషే జారిపోయేవాడు
నేడు
మనిషి అలానే ఉంటున్నాడు
మెట్లే జారిపోతున్నాయి.

*

('నేటి నిజం' మహాశివరాత్రి ప్రత్యేక అనుబంధం 2006)

# శ్రమ యజ్ఞంలో

కళ్లల్లో కడుపును దోపుకున్నప్పుడు
తలలో కాళ్లు బారజాపుకోవడం కుదరదు
చేతుల్నే వెన్నెముక చేసుకున్నప్పుడు
గుండెల్లో నోరు పెగలాల్సిందే

భూమి చర్మాన్ని నాగేటికొర్రు చెక్కినా
యంత్రమైన మనిషి
ఫ్యాక్టరీ గొట్టంలోంచి ఊపిరి పొగలు కక్కినా
శ్రమ నిప్పుల హింసగా మారి
వేతనాల త్రాసు తూకం కోతిచేతి రొట్టె ముక్క అయితే
పిల్లుల పిరికి బతుకును యాజమాన్య విశ్వాసం కుక్కే కబళిస్తే
ఒకడి శ్రమ మరొకడి దోపిడీ పరిశ్రమ అయినపుడు
ఒకడి పంట భూమి మరొకడి బహిర్భూమి అయినప్పుడు
ఒకడి కష్టించే చేతులు మరొకడి నోట్లో సుఖించే వేళ్లయినప్పుడు
ఒకడు ఒఖ్ఖడేగా ఉండడు
అలాంటి ఒకళ్లు వాళ్లు కాకుండా పోరు
అనివార్యంగా పోరు చేయకపోరు

విడిగా వాళ్ల కళ్ల తిరిగిన నీరు కన్నీరు
ఉమ్మడిగా కల్లోల హృదయంలో బడబానలంగా ఉబికి
బతుకు సమస్యల సముద్ర మధనంతో
విషం కాదు అగ్నిపుడుతుంది

వీడూ కట్టే మరొకడూ కట్టే
శ్రమ యజ్ఞంలో సంఘర్షణ అరణిలా రగిలినపుడు
కట్టెల్లోనే అగ్నిసుధ రూపు కడుతుంది

మనిషి కట్టె అయితే,
కట్టె పనిముట్టయితే,
మనిషి అరణి.
మనిషి శ్రమే ఆయుధం.

✻

('ఆంధ్రప్రభ' వారపత్రిక, జనవరి 20–26, 1993)

# చెలామణి

మీరు మునుపటిలా లేరు
అంటుంది తను.

ఔనేమో
అభివ్యక్తం కాకుండానే
భార్యను అర్థం చేసుకోమనడం
కవిత రాయకుండానే కవిగా గుర్తించమనడమే.

స్పర్శ కవిత్వం
లాలన కవిత్వం
ఓదార్పు కవిత్వం.
తన దుఃఖానికి తనను వదిలివేయడమంటే
పట్టించుకోకపోవడమే
వనితనైనా, వ్యవస్థనైనా,
ప్రేమించడం మానింది ఎప్పుడు
కానీ అభివ్యక్తే మందగిస్తుంది
భార్య కానీ, కవిత్వం కానీ.

భార్యను పట్టించుకోకున్నా
భర్తనే అంటే చెల్లుతోంది కానీ
కవిత్వం రాయకుండా
కవినే అంటే చెల్లదు.

*

('ఆదివారం వార్త', 19 ఫిబ్రవరి 2006.)

# అంతా వాళ్లే చూసుకుంటారు

నేను-నువ్వూ-మనం
నేనుంటాను-నువ్వుంటావు-మనముంటాం.
ఉంటామంటే ఉంటామంతే!
అంతా వాళ్లే చూసుకుంటారు.

మనపనే కానీ ఏదీ మన ప్రమేయం?
పిల్లల చదువు సంధ్యల నేపథ్యాన
అమ్మమ్మలూ, తాతయ్యలూ -
ఉమ్మడి కుటుంబమే నేడు హుళక్కి
రాబడుల బడులు ఇంగ్లీష్‌మీడియం ప్రైవేటీకరణంగా
కార్పొరేట్ కళాశాలలుగా -
అమెరికా ఉద్యోగమే ఆదర్శంగా విస్తరిస్తూంటారు.
అంతా వాళ్లే చూసుకుంటారు.

జ్ఞానమా? - అదేమిటి?
వినోద వికాసాలా - అవేమిటి?
దినపత్రికలూ, గ్రంథాలయాలు ఏవీ అక్కర్లేదు.
రకరకాల టీవీ ఛానెల్స్ వారున్నారు -
వార్తలు, సంచలన కథనాలు - అంతా
దృశ్య మాధ్యమ ఉగ్రవాదం

నీ చూపు, మెదడూ ఎలా ట్యూన్ చేయాలో
అంతా వాళ్లే చూసుకుంటారు.
బాంబుదాడులు, తుత్తినియ శరీరాలు, ఆత్మహత్యల క్లోజప్‌లు
రోడ్డు ప్రమాదాల మాంస ఖండాలు, నేరాలు ఘోరాలు

వర్ణభరితంగా చూపుతూ హృదయాన్ని రాతిబండ చేస్తారు.
అనుక్షణం సంచలన వార్తలు వండడం,
కనువిందని తినిపించడం
అంతా వాళ్ళే చూసుకుంటారు!

నిరంతరం తదృశ్య వీక్షణ ప్రేరితుడివై
అమానవీయంగా ఎవరినయినా తన్ను, చంపు -
డబ్బుందా, సినిమా వాడివా,
అధికారంలో ఉన్నావా, రాజకీయం అండ ఉందా-
ఇంకేం! అంతా దిలాసా కులాసా!
పోలీసులు, న్యాయవాదులు, ఫోరెన్సిక్ నిపుణులు,
అంతా వాళ్లే చూసుకుంటారు.
చట్టాలు నీ చుట్టాలుగా మారి గ్రక్కున కావలించుకుంటారు
జైళ్ళు అయిదు నక్షత్రాల హోటళ్లూ సౌకర్యాల్లో సమానంగా
అంతా వాళ్లే చూసుకుంటారు!

పెళ్లిళ్లు జరుగుతాయి - పేరయ్యలక్కరలేదు
ఇంటర్నెట్ ఛాటింగో, మ్యారేజ్ బ్యూరో రిజిస్ట్రేషనో
ఏ వరుడికి ఏ వధువో ఊహాచిత్రాలే జతచేస్తాయి.
అంతా వాళ్లే చూసుకుంటారు.
పెళ్లి పనుల హడావుడి ప్రశ్నే లేదు! క్యాటరింగ్ కిచ్చేయండి -
భోజనాలే కాదు, శోభనం గదిలో పాలగ్లాసు కూడా
పెళ్లి కూతురు క్యాటరర్ చేతే పంపేయచ్చు
అంతా వాళ్లే చూసుకుంటారు!

ఆరోగ్యానికి హెల్త్ స్కీమ్‌లున్నాయి-
కుటుంబ సమేత నమోదుతో - పుట్టిళ్లు, అత్తిళ్లు
ఏవీ అక్కర్లేకుండానే పెళ్లాం పిల్లల్ని కనేస్తుంది.
అంతా వాళ్లే చూసుకుంటారు!
కావాలంటే గుండెపోటు బిల్లులతో తెప్పించి మరీ
కార్పొరేట్ ఆస్పత్రులు ఆపరేషన్లు చేస్తాయి.
వెంటిలేటర్ మూయాలో, తీయాలో,

అంపశయ్య మీద నవీన భీష్ములుగా ఎంతవరకు ఉండాలో,
అంతా వాళ్లే చూసుకుంటారు.
మార్చురీలు, పోస్టుమార్టంలు సరే!
హరీమన్నాక – శ్మశానక్రియలకూ ఈవెంట్ మేనేజ్‌మెంటే!
అంతా వాళ్లే చూసుకుంటారు!

ఎలక్ష్యూషన్లూ, ఫ్యాన్సీ డ్రెస్సులూ, బెల్లీ డ్యాన్స్‌లూ, క్యాట్‌వాక్‌లూ,
డిస్కోథెక్‌లూ ఉన్నాయేగానీ –
తెలుగు భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలు,
మల్లెపూలు, మినపలడ్లూ తెలుగుదేశంలో ఇక్కడేవీ అంటారా?
ఎందుకులెండి, మరేం ఫర్లేదు!
వాటి రక్షకు ఎన్.ఆర్.ఐ.లు ఉన్నారుగా –
అంతా వాళ్లే చూసుకుంటారు.

ఇరాన్, ఇరాక్, పాలస్తీనా, పాకిస్థాన్,
బంగ్లాదేశ్, భారత్ ఏ దేశమైతేనేం!
ఎలా నడవాలో, ఏం చేయాలో
అమెరికాలో బుష్షూ వాళ్లున్నారు –
అంతా వాళ్లే చూసుకుంటారు!
మనం గాలి వదలాలో, పీల్చాలో
ఉన్న ఊళ్ళో ఉండాలో, వలస పోవాలో
ఉద్యోగం, వ్యవసాయం – ఏదయినా ఎలా చేయాలో
చద్దామన్నా ఉరిపోసుకోవాలో, పురుగుమందు తాగాలో
రైతు నుండి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దాకా
ఎవరినయినా శాసించడానికి
ప్రపంచీకరణ పేరున, ప్రపంచ బ్యాంకు తాఖీదున
సామ్రాజ్యవాద శాసనాలతో – ఆంక్షలో, కాంక్షలో
అంతా వాళ్లే చూసుకుంటారు!

కవులా, మేధావులా, సంస్కర్తలా – ఏరీ వారు?
సంచలనాత్మక దైనందిన ఘటనల స్పందనల నమోదు
కాగితం మీదో, వేదికపైనో చేసి –

అచ్చుకెక్కించుకునో, అరిచో, వాదించో,
పారితోషికాలకూ, శాలువలకూ, సన్మానాలకూ
పడిపోతున్న భావుక విలేఖరులు మాత్రమేగా!
సార్వకాలీనత తప్పి, జనమమేక చైతన్యం తప్పి,
తప్పుతాగయినా అంతా వాళ్లే చూసుకుంటారు.
గొప్పల తిప్పలతో వాళ్ళలో వాళ్లే చూసుకుంటారు.
విలువల వలువలు కోల్పోయినా సాహిత్య సరస్వతిని
ఎమ్.ఎఫ్. హుస్సేన్ బొమ్మలో చూసుకుంటారు.

సమాల్ కమాల్ ధమాల్‌లు కొత్తవేం కావు.
చేతులు తడిపే అవినీతితో
ప్యూన్ నుండి ప్రజాప్రతినిధి వరకూ – కార్యం ఏదయినా,
కార్యరంగం ఏదయినా, అంతా వాళ్లే చూసుకుంటారు!
ఈ దురవస్థల వ్యవస్థలో
నేను–నువ్వూ–మనం– ఆలోచించకపోతే
ఉంటామంటే ఉంటామంతే!
అంతా వాళ్లే చూసుకుంటారు.

కానీ ఈ స్థితి హేతువులూ, నేతలూ, ఎన్నికలూ, రాజకీయాలూ
వ్యవస్థాగత మార్పులు చూస్తూ
కడుపు మండుతున్న ప్రజలున్నారు.
మనవాళ్ళే – మనలోని వాళ్ళే –
నిజాయితీపరులున్నారు.
నిద్రను విదిల్చే వైతాళికులున్నారు
చీకటిని చీల్చే దీపకళికలున్నారు
జీవితమంటే వర్తమానం ప్రశ్నార్థకమౌతున్నా
భవిష్యత్తు సమాధానం ఏమిటో తప్పక
అంతా వాళ్లే చూసుకుంటారు.
అంతటా వాళ్లయి చూసుకుంటారు.

*

('పత్రిక' జన్మదిన దీపావళి ప్రత్యేక సంచిక, నవంబరు 2007)

# అమరిక

ఏ గూటి చిలక ఆ పలుకే అంటుందని
నమ్మకం కుదరడం మానేసింది.

భాష ఒక పిట్ట
నీ గూటిలోనే ఉండదు.
అనంత విహాయసంలో గిరికీలు కొడుతుంది.
చివరకు తన గూడే చేరుకుంటుంది.

సంస్కృతి ఒక చెట్టు.
శిశిరంలో ఆకులు రాల్చినా
వసంతంలో మళ్ళీ చిగురిస్తుంది.
పిట్టకు రెక్కలున్నాయి ఎగరడానికి,
చెట్టుకు కొమ్మలున్నాయి విస్తరించడానికి.

నిఘంటువుల్ని శ్మశానాలతో పోల్చకు,
నువ్వు సజీవంగా పాతిపెడుతున్నవి నీలోనూ లేవూ,
చెట్టును కూలగొట్టడం
ఈ గ్లోబల్ ఖడ్గం చేస్తున్న పనే.

పసిపిల్లల పదాలను, పాదాలను
అమ్మా నాన్నల గుండెలమీదో,
ఆట మైదానాల మీదో నిషేధించి
దృశ్యశ్రవణ వేదికలపై నీది కాని లయల్లో, తూగుల్లో
నర్తింపచేయగా లేనిది

వాయనాల పేరంటాల్ని
వాలెంటైన్స్ డేలో విలీనం చేయగా లేనిది
భావాలను మాత్రం భాషాంతరీకరించవా
అనుబంధాలను మరే భేతాళ వృక్షం మీదో అనువదించవా

నింద ఎవరిమీదో వేయకు
నీ అమరిక సరిగ్గా లేక కేవలం అమెరికాని దుయ్యబట్టకు
అమ్మ అనవద్దని ఏ ఈజిప్షియన్ మమ్మీ అంది?
అద్దం పగలగొట్టాక వెయ్యి ప్రతిబింబాలు.
ముక్కల్లో చెప్పడం కష్టం. మూడయినా ముప్ఫయ్ మూడయినా,
జ్ఞానదంతం అధికమని ఒక అజ్ఞానం
తేగలు, రేగులు, పేగులు ఎప్పుడోతెగాయి.
ఛెర్రీలు హర్రీలు వర్రీలు.

అమ్మాయి బాయ్‌ఫ్రెండ్‌తో తల్లి డేటింగుల
w.w.w. ఫైటింగుల సమాజం కాదు మనది,
మిడ్డీలు – పట్టు పరికిణీలు వదిలేయాలా
పిజ్జాలు, బర్గర్లు – మినపరొట్టె, బొబ్బట్లు పారేయాలా
బాపుబొమ్మ, కృష్ణశాస్త్రి పద్యం చెమ్మ
శ్రీశ్రీ తేజం తెలుగుతనంలో వదిలేయగలవా

ఎన్ని వైరుధ్యాలు, ఎన్ని అసాధ్యాలు, ఎందరు అసాధ్యులు
సంస్కృతి – ప్రకృతి కృతిలో సజీవంగానీ,
కృత్రిమ వర్షాల హర్షాల కెమికల్ ఫెర్టిలైజర్ సస్యాల
యాంత్రిక వంటకాల బఫే భోజనాల జనాల పరుగుల
ప్రపంచంలో
కల్చరల్ పొల్యూషన్‌కు గురి అయితే నివ్వెరపోవడమెందుకు?

ఇంతకీ ఎందుకంత కంగాళీ కుప్పిగెంతులు
ఏమీ భయంలేదు!
భాష చావదు, సంస్కృతి సమసిపోదు,

అంతా ముగిసిపోలేదు,
అంతా మారిపోనూలేదు
రెక్క ముడుచుకు పోలేదు,
వేళ్లు తెగిపోలేదు.

పిట్ట ఎగురుతూనే వుంటుంది.
చెట్టు పెరుగుతూనే వుంటుంది
నువ్వు పంజరాలు నిర్మించకు,
గొడ్డళ్లు విసరకు చాలు

నీ బుద్ధిని విశాలం చేసుకుని
నీ హృదయాన్ని పాదుకొల్పుకుని
పిట్టను, చెట్టును సమాదరించు,
కనీసం అమ్మను అమ్మా అనే పలుకరించు.

✻

('నడుస్తున్న చరిత్ర' మాసపత్రిక. ఫిబ్రవరి 2004.)

# సరసా విరసా తుసాభుసా

విద్య వ్యాపారమైనప్పుడే
సరస్వతులు సరసావతులుగా మారి
లక్ష్మీ మమేకమయ్యారు
ఇవాళ బడి రాబడి మార్గం
పుస్తకం
అక్రమార్జన ముద్ర(ణ)లకు నతమస్తకం

డిపెప్ నదిలో డిప్ చేసి
మునుగంగా
పాపాల పంకిలమంటిందెవరికి
ఎక్కడుంది లోపం
దిగలాగుతూ ఎలా నెలకొన్నదీ కూపం

బండెడు పాఠ్యపుస్తకాలు, నోట్స్‌లు
టీవీలు, సైన్స్ పరికరాలు
పుస్తక ప్రచురణలు
అడిగాడా బడి పిల్లాడు?
ఉపాధ్యాయుడే ఒకప్పుడు
సారవంతమైన పాఠాలు జల్లాడు
తన మీద తానే నమ్మకాన్ని కోల్పోయి
ఇవాళ తీరికూచుని అవినీతిని గిల్లాడు

బోధనా వనరులు
కొందరిని సంపాదనా పరులను
చేస్తున్నాయి
విద్య కోసం నిర్దేశించిన పథకాలన్నీ
విత్తం కోసం
ఆదాయ మార్గాలవుతున్నాయి

ఉన్నత లక్ష్యాలు, సంకల్పాలు
బయలుదేరిన కేంద్రం నుండి
చేరవలసిన గమ్యాలు చేరడానికి
నడుమ ఎందుకొస్తున్నాయీ
ఆమ్యామ్యాల అవరోధాలు
ఎలా సృష్టిస్తున్నాయి విరోధాలు

సంబంధం లేని అమ్మ
కాలు పెట్టి
ఎలా చేసుకోగలుగుతోంది
తన అమ్మకాలు
ఎలా నీరుగారుస్తోంది ప్రజల నమ్మకాలు

అమృతం పంచడానికి
మోహినీ అవతారంలా
నిధుల కైంకర్యానికి సరసావతారం
సర్వశిక్షలకూ అభయం
ముందే పొందినట్లు
అధికారగణాన్ని
కనుల కెమెరాలతో బంధించి
విందులు పొందులు అందించి
అవినీతి గగనానికి లాంచ్ చేసిన
డిస్కవరీ రాకెట్
నదీనాం సాగరోగతిః
నిధులన్నీ బినామీ అక్కౌంట్ల తతికి

సరసా విరసా తుసాభుసా
రాయల ఆస్థానకవి
వికట కవిత్వ పద్యం కాదు
రాజశేఖరాస్థానపు
అంతరంగికుని ఆంతరంగికురాలి
అప్రకటిత ధనాదాయ సేద్యం
అవినీతి విజయసారథుల నైవేద్యం

✻

('ఆంధ్రభూమి' దినపత్రిక 19 ఏప్రిల్ 2007.)

# ఎంత ఎంత ఎడమైతే...

గుంపులు గుంపులు గానే మబ్బులు
కొండను ఢీకొని వర్షం రావడం చూసాను
అలలు అలలుగానే సముద్రం
ముందుకురికి పడవను సాగనివ్వడం చూసాను.
జ్వాలలు జ్వాలలుగానే నిప్పు
ఆహారాన్ని పచనం చేయడం చూసాను.
తారలు తారలుగానే ఆకాశం చంద్రకాంతితో బాటు
వెలుగు వెన్నెలలని పరచడం చూసాను
పొరలు పొరలుగానే నేల
సారవంతమైన పంటలనివ్వడం చూసాను

కలయికలో ఇంత కలిమి
సమష్టిలో ఇంత అభివృద్ధి వుండడం చూసి కూడా
వేరు పడటం కోసమే
మనుషులు గుంపులు కట్టడమూ చూసాను
కలుసుకోవడం విడిపోవడం కోసం అయినప్పుడు
విడిపోయాక
కలుసుకోవడం కోసం
ఆరాటపడడమూ అంతే సహజమని
మానవ సంబంధాల గురించి
మరోమారు అర్థం చేసుకుంటున్నాను.

*

(6.2.2011)

# చివరి జాప్యం

మారుతున్న విలువల్లో
మనిషీ మారక ద్రవ్యమే.

చెలామణీ కాని నాణెంగా మారుతాడని
చెప్పలేదుగా ఎవరూ, ముందే ఊహించేందుకు

చిల్లుకాణీ లాగానో
చిరిగిన నోటు లాగానో
పడక్కుర్చీకీ పరిమితమైన ముసలాడు,
నిన్నటిదాకా ఇంటి యజమాని

ఇంకా ఆధిపత్య పోరులో పై మాట కావాలనే అభిలాష
అంతా తనను గౌరవించాలని
తన ఆదేశాలకు ఒదిగుండాలని
ఒకటే తాపత్రయం
ఎక్కడలేని విషయాలూ కావాలి

కళ్లపై అద్దాల కళ్ళు చేరినా
ఛానెళ్ళ వర్ణ వీక్షణా కాలహరణ
కామనయే.
ఫలితకేశాలు ఆవరించినా
హృదయం యవ్వనానుభవ ఆస్వాదయే.

కూడబలుక్కుని కూడబలుక్కుని మాట
కూడదీసుకుని కూడదీసుకుని నడక

గూడు వదలని గువ్వ ఆరాటం
గేహం వదలని ప్రాణి
జీర్ణ శిథిలావస్థకు చేరినా
జీవనాభిలాష మందగించదు

ఆదరింపులు, విదిలింపులు,
చీదరింపులు, సణుగుడులు
ఆంక్షలు శాసనాలు
అన్ని వైపుల నుండి సంధించబడిన
గురి కాబడిన గువ్వే

వృద్ధాప్యం రెండో బాల్యం
చింత చచ్చినా పులుపు చావని లౌల్యం

వృద్ధాప్యం –
బ్రతుక్కీ మృత్యువుకీ మధ్య
చివరి జాప్యం.

*

('విపుల' మాసపత్రిక, మే 2006)

# చావుబేరం

దింపుడు కళ్ళెం వేళ
గుర్రపు కళ్ళెం వేగమా
పరుగులిడి పరుగులిడి
ఎంతో ఆరాటపడి జీవించికదూ
విశ్రమించింది
జీవిని అప్పుడూ ప్రశాంతంగా
మోసేయలేరూ?

శవదహనానికీ బేరాలు,
జమాఖర్చులు.
ఎవడికి వీలైనప్పుడు వాడు
వాడి వృత్తిలో పై సంపాదనకై
తహ తహ

ఈ మాటు చూసుకుందాంలెండి
ఈసారికి ఇలా కానివ్వండి
చందనం కర్రలా?
మామూలు కట్టెలా?
కట్టెను కాల్చడానికి
ఖరీదును బట్టి శవం విలువానూ

చేతికి ఎముకలేకుండా దానాలు చేసినవాడే
వాడి ఎముకలేరుకునే వేళలో

వేడి వాడి చర్చా సందర్భం
గోదాట్లో బూడిద కలిపేదాకా
తర్జనభర్జనలే

ఔను
నిస్సందేహంగా
ధనమూలమిదం జగత్
చచ్చినా వదలని మిత్
ఏకం సత్ బహుధా విప్రా వదంతి
చితిలోనూ చ్యుతి లేని
అమానవీయం
మృతి.

✻

(12.9.2011)

# చేతులు కురిసిన చేతన

కురిసే చేతులుంటే
మొలిచే భూమి వుంటుంది
మొలిచే భూమిలోంచి
మొక్క పరిమళిస్తుంది

ఆకాశానిదేముంది
అది వట్టి వేదిక
సముద్రం ఆవిరవందే
మేఘం ఆసీనం కాలేదిక

మేఘానిదేముంది
అది హృదయానికి స్పందనాకృతి
హృదయం సముద్రం కావడానికి
కరుణ కరిగి కదలాలి

కరుణదేముంది
అది లాలిత్యపు భావన
ఓదార్పు దిక్కుల నుంచి
ఎడారి ఓడ మోసుకొచ్చే జంట సాధన

జంటలదేముంది
విశ్వాసపు కలయిక
నిలచి నిలుపుకోగలిగితే
వ్యష్టి నుంచి సమష్టివైపు చేతన

చేతనంటే ఏమిటంతకూ
నీ, నా అనే మన చేతయే!
భూమిని సాగుచేసేందుకు
కలిసి కురిసే మన కృషియే
చేతులు కురవడమంటే అంతే!

మొక్కవోని దీక్షతో
మనసు పరిమళించాలి
మనసు మనసు కలిపి
మనం పరిశ్రమించాలి

కురిసే చేతులుంటే
మొలిచే భూమి వుంటుంది
మొలిచే భూమిలోంచే
మానవత్వం పండుతుంది.

*

(ఆదివారం 'వార్త' 15 ఏప్రిల్ 2007)

# అన్వేషణ

అంటే ఏమిటనే ప్రశ్న
అనేకానేకంగా ఆవిర్భవిస్తూ
నిఘంటువులవెంటా
పురావస్తుశాలల వెంటాపడింది
కళ్ళ ముందు చూస్తూ చూస్తూ ఉండగానే
అదృశ్యమైపోతున్నయి కదా ఎన్నెన్నో

ఇది ఒక పదమా, కాకుంటే పదార్థమా
ఎక్కడని వెతకను
నా చూపు మందగించిందో
లేక తనే మసకబారి మసకబారి
తరలిపోయి మటుమాయమౌతోందో
ఎవరైనా చూసారా అని
ఆర్తవతంసుడనై అడుగుతూనే వున్నా
అసలు ఎవరికీ పట్టినట్టే లేదు.

ప్రత్యేకరాష్ట్రం గురించీ,
ప్రపంచ కప్పు విజయం గురించీ
ఆయన ఉద్యమించే దాకా అసలు ఉన్నట్టే పట్టనట్టున్న
అన్నా హజారే ధ్వజమెత్తిన అవినీతి గురించీ
ఒకటే ముచ్చట్లు పెడుతున్నారుగానీ
దీని స్పృహే లేదే

ఖర ప్రవేశించి
గాడిదలమయ్యామనుకుందామంటే
మునుపే వికృతిలో వున్నామాయె
ప్రభవాదిగా ప్రకృతే
అలా మలుచుకుంటున్నామాయె

నిజమే
మునుపింత విషాదం ముప్పిరిగొనలేదు.
ఇంతో కాసింతో ఇంగితం వుండేది
చెట్టు నరకాలంటే చేతులాడేవికావు
మొక్క నాటడానికి మురిపెం వుండేది
భూమిని నమ్ముకున్నవారేగానీ
ఇలా అమ్ముకున్నవారు తక్కువ
పక్కపక్కల విస్తరించుకోవడమేగానీ
ఇలా ఒకరినెత్తిన ఒకరు పైకెక్కి నివసించే
అపార్ట్‌మెంట్ కల్చర్ అధిగమించింది కాదు

ఉదయాస్తమయాల సూర్యచంద్రులను
పెరటి వేపచెట్లనూ, అరటినీ, మామిళ్ళనూ ఎరుగని
పిదపకాలం వస్తుందనుకున్నామా
సహజవనరులైన నీటినీ, గాలినీ కూడా
అమ్మకం సరుకుగా కొనుక్కు
వాడుకోవలసి వస్తుందనుకున్నామా.

టీ.వీ. మైదానాల్లో చూడడం తప్ప
సహజంగా ఆడుకోలేని ఎడారి స్థితి
దాపురిస్తుందనుకున్నామా

కోతికొమ్మచ్చులూ లేవు,
ఈత బావులూ లేవు
నగరం ఒక కాంక్రీట్ జనారణ్యం

తెల్లవారి లేస్తే రక్తమోడుతున్న దినపత్రికలు
నిరంతర దృశ్య శ్రవణ వార్తాహింస
కక్షలు కార్పణ్యాల జీడిపాకం సీరియల్స్

ఎక్కడని వెతకను
ఖచ్చితంగా భయపడి పారిపోయే వుంటుంది
పాపం కల్మషమెరుగని భోళాభాళాది

పువ్వులో కనబడేది,
నవ్వులో కనబడేది
యువజంట లవ్వులో కనబడేది
మావిచివురు కొమ్మ మాటు
కోకిలమ్మ మధురస్వరంలో వినబడేది
కొత్త పెళ్ళి కూతురు అడుగులో తడబడేది
ఉగాది నాటి కవిసమ్మేళనంలో
కవిగారి అక్షరంలో చొరబడేది
ఏమై పోయిందో
అచ్చమైన వసంతం, పచ్చ పైరు వసంతం
మచ్చలేని వసంతం
ప్రకృతిలో తచ్చాడడం లేదు.

హృదయ పుష్ప వసంతం కోసం
తనువు తరువును
సంక్షుభిత సమాజ శిశిరంలో
రాల్చుకుంటూనే వున్నాను
వసంతం సంత సరుకు కాదు
కానీ ఇంత వింత కొరతవుతుందనుకోలేదు

ఆలస్యం కాకుండానే
అన్వేషించి తెచ్చుకుందాం రండి
దూరదూరాలకు పోకుండా
దక్కించుకుందాం రండి

కాసింత భరోసా
కాసింత నమ్మకం కలిగించి
కాలధర్మం చెందకుండా
కాల ధర్మాన్ని కాపాడుకుందాం
చైత్రాన్ని చిత్తంలో నిలుపుకుని
మానవీయమై చిగురిద్దాం

✻

(హైదరాబాద్ ఆంధ్రప్రభ దినపత్రిక నూతన కార్యాలయంలో కవిసమ్మేళనం 23.4.2011)

# వీక్షణ విహంగం

విహరించదలచిన
విహంగానికే కావాలి గురి
మాటల బాణాలతో పక్షిని మరల్చజూచే
వలపన్నే వేటగాళ్ళుంటారు
అవరోధాలు అధిగమించి
దృశ్యాల మీద వాలడానికి
దృశ్యాంతరంగానుభూతితో కువకువ లాడడానికి
ఎగిరి వాలడానికి ఒడుపు కావాలి.

పక్షి ఎగరాలి
ఆకాశాన్ని అంతరంగంలో దించుకోవాలి
అంతరిక్షం ఒకటే
అంతర్వీక్షణలు అనంతం

ఎన్నెన్ని దృశ్యాలు!
అవును
రెప్పల రెక్కలు విచ్చుకున్నప్పుడల్లా
చూపుల విహంగాలు దృశ్య విహాయసంలో విహరిస్తాయి
పక్షులు వాలిన చెట్టై
మనిషి నేత్రపర్వంగా
ప్రకృతిలో దృశ్యమౌతాడు.

*

('ఆదివారం ఆంధ్రభూమి' 7 మే, 2006)

# కవిత్వం నా రావణకాష్ఠం

గడియ గడియల
గడులన్నీ గడ్డులే.
కాలం ఒక పజిల్
గడులలో చిల్లర డబ్బుల
గణియింపులు,
గడియింపులు ఆశించడం –
సాల్వ్ చేసే సమస్యార్థమే.
కవిత్వం అర్థం కాని వాడు కాదు,
అర్థం లేని వాడు వ్యర్థం.

కవిత్వార్థాలు మారిపోయాయి
వాగర్థంలా ఉండవలసిన వామాంగియే
సాధనామార్గాన్ని శోధించమంటూంటే –
ధర్మం ఒకటుంది కాబట్టి
కామం ఇంకా చావలేదు కాబట్టి
మోక్షం మీద మోజు లేదు కాబట్టి
ధర్మకామాల మధ్య దాని కోసం –
అవసరార్థం పరుగులు తప్పడం లేదు కవికి.

పరిగెత్తగల ప్రజ్ఞా, ఓపికా రెండూ లేవు
వయసూ మీద మీదకు వస్తోంది.
ఇంకేం చేస్తాడు –

గడియగడియకూ గడులలో
పోపులపెట్టెలో పైసల్లా
గణించుకుంటూ, గడించుకోవాలని
ఆర్తితో గజగజలాడతాడు.
అక్షరలిచ్చేవాళ్లు ఎవ్వరూ లేరు
లక్షణమైన కవిత్వం కుక్షి నింపదు
హృదయం ఆకలిని మాత్రమే తీరుస్తుంది.

హృదయాలు గాయపడితే
చికిత్సకోసం కవులను ఆశ్రయించలేమిప్పుడు
గేయాలే గాయాలవుతున్నాయి
స్టెప్పు బై స్టెప్పు శ్రమించిపోగేసిన రూక
ఆంజియోప్లాస్ట్‌లో ఏ స్టెమ్‌కో స్టంపౌట్ కావచ్చు
ఎంత అర్థవంతమైన కవిత్వం చెప్పినా
నీ ఆర్థిక స్తోమతే సాటివాడి గణనలోనికి వస్తోంది
కవిత్వమూ, అర్థమూ రెండింటినీ వేరువేరుగా
పుష్కలంగా కూడగట్టుకోవాలి.

అనుభవాన్ని అక్షరీకరించుకున్నా
ముద్రించుకుంటే తప్ప మోక్షం లేదు వ్యవస్థలో
తులాదండాలు, గీటురాళ్లు
సాటికవుల విమర్శకుల చేతుల్లోనూ లేవు
వారిలో – అర్థబలం, అంగబలం, అధికారబలం వున్న
లౌక్యపీరుల చేతల్లో వున్నాయి.

నీ బయోడేటాలో
ముద్రిత గ్రంథాల పట్టికా,
అవార్డుల చిట్టా లేకపోతే
నువ్వేం కవివంటారు.

దారికిరుపక్కలా నువ్వెన్ని పజ్యాల మొక్కలూ, చెట్లూ
నాటుకుపోయినా గుర్తింపురాదు

నువ్వోతోటవై పేరు పెట్టుకోగలగాలి
అశోకుడి యుద్ధం తరువాత విజయశాసనం
శవాల గుట్టలేనని తెలిసినా చరిత్ర కీర్తిస్తుంది
అశోకుడు శరణం వేడిన మతం
వట్టి దళితుల అభిమతంగా మిగుల్తుంది
లక్ష్మీనారాయణస్వామి దేవాలయభోగం తెరకెక్కినట్లు,
శివుని విభూతి ఆనదు.

భవిష్యత్ చిత్రపటంలో కవితా హృదయం కన్నా,
అర్థ విప్లవమే మిగిలింది
బయట అంతా పెద్ద ప్రహేళిక
పదబంధాలు కాదు, పాదబంధాలు ఎక్కువ
నీ హృదయం కింద చిరునామా ఎవరికీ అక్కర్లేదు
సొంత ఇల్లూ, సెల్‌ఫోనూ, రంగుకారూ ఉన్నాయా?
లేవు కదా -
అక్షరం నేల, శబ్దాల హేల, అభివ్యక్తివాహనం వున్న
కవివయితే నువ్వు -
అనామకునిగానే కనుమరుగవడానికి కావాలి సిద్ధం
లేదా తప్పదు ఇలాంటి
బహిరంతర సమన్వయానికి అందని యుద్ధం.

ప్రహేళిక పూర్తవుతుంది
కవిత్వం మరుగుతూనే ఉంటుంది
పదబంధం సంధించిన విల్లు
కవిత్వం నా రావణకాష్ఠం.

✻

('ఆంధ్రజ్యోతి' దినపత్రిక 'వివిధ' - 19 మార్చి, 2007)

# మలిగిన దీపం వెలుగు

వచ్చిన చిక్కే అది
ఎంత అస్పష్టమవుదామని వున్నా
డాబాపై ఆరబోసిన
మాగాయ ముక్కలను
కాకి ముక్కున కరుచుకు
ఎగిరిపోయేటంత సులభంగా
పహరా కూడా లేదు కదా
నా తీరే అంత

వొలిచేసిన ఉల్లిపొరల్లా
తీసేసిన గింజ పొట్టులా
అంతా పరుచుకున్నదే

స్వప్నఖచిత సింహాసనాలేమీ లేవు
అధికారాలూ లేవు
అభిశంసనలూ లేవు
దుర్వినియోగం చేసేందుకు
దుఃఖపడనా
ఒక గాలి తరగ తాకితే చాలు
ఉఫ్ అని ఎగిరిపోయేటందుకు

నిజమేగా
ఎవరైనా ఎందుకు అనుసరిస్తారు

ఒక తపన కావాలి
ఒక అన్వేషణ కావాలి
తెలుసుకోవాలనే ఒక ఆతృత పంచాలి
కామోసు కామోసు
ఏమీ లేదే నా దగ్గర
గుప్పిట మూసిన రహస్యం ఒకటి పట్టుకుని
చుట్టూ తిప్పించుకుందామంటే
ఎందుకింత బహిరంగం

నాకు నేను రహస్యం ఎలాగూ అయినప్పుడు
నాకు తెలిసినమేరకు
ఎదుటివారికి అర్థం కావాలనే
ఇంత వెసులుబాటునిచ్చి
వెర్రి వెధవనవుతున్నానని తెలుసు
అయితేనేం
మార్మికత కృత్రిమత కదా

పోనీలే
ఈ లోకం ఒక పసిపాప
పరీక్షలు నేను రాస్తాను గానీ
దానికెందుకు పెట్టడం
కాపీ కొడుతూ పట్టుబడే
కాఠిన్యం వద్దు.

ఇంక ముగించు
సంపూర్ణంలో
వెల్లకితలా పడిన చివరి శరీరమే
రహస్యం ఎక్కడ
అసలు నిజం తెలిసాక
అంతా విడిన రహస్యమే
ఆ కాడికి ఎందుకింత పజిలింగ్ పజిల్

అడ్డం నిలువు గళ్ళ ఆధారాలతో
ఒక పదబంధ ప్రహేళిక మాత్రమే
కనుక్కో
కనుక్కుని ఆనందించు.

ఇంతకీ రహస్యం కాదు ముందున్నది
ఒక ప్రహేళిక
ఒక క్రీడ
వచ్చిన చిక్కు విప్పిన చిక్కే ఇది
సమాధానం తెలిసేంత వరకూ మాత్రమే
మాగాయి మా కాయం
కాకి పరమాత్మం
పొరల పొరల పొడల పొడల జీవితం
మలిగిన దీపంలో వెలుగు తెలిసాక
వెలగడంలో
అంతా వెసులుబాటే!

✻

('నవ్య' దీపావళి ప్రత్యేక సంచిక, అక్టోబర్ 2011)

# కవి పరిచయం



(చిత్రకారుడు: మృత్యుంజయ)

**'సుధామ'**

**అసలు పేరు:** అల్లంరాజు వెంకటరావు

**జననం:** 25.11.1951

**తల్లిదండ్రులు:** శ్రీమతి అల్లంరాజు (ద్విభాష్యం) రాజేశ్వరమ్మ, కీ॥శే॥ అల్లంరాజు కామేశ్వరరావు

**విద్యాభ్యాసం:** బి.ఏ, యం.ఓ.యల్ (ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, హైదరాబాద్)

ఎం.ఫిల్ (ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల, హైదరాబాద్)

'తెలుగు అభ్యుదయ కవిత్వంలో భావచిత్రాలు' (ఇమేజరీ ఇన్ ప్రోగ్రెసివ్ తెలుగు పొయెట్రీ) పై సిద్ధాంత రచన.

**వృత్తి:** కరీంనగర్ బిషప్ సాలమన్ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్ (1975-1977)

1978 జూన్ 1న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో (వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగంలో) ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా చేరిక.

1991లో ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా పదోన్నతిపై ఆకాశవాణి విజయవాడ కేంద్రంకు బదీలి అయి, తిరిగి హైదరాబాద్,

వరంగల్ కేంద్రాలలో పనిచేసి 2008 ఆగస్టు 1న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం (వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం) నుండి కార్యక్రమ నిర్వహణాధికారిగా స్వచ్ఛంద పదవీ విరమణ.

**ప్రవృత్తి:** కవి, రచయిత, చిత్రకారుడు, కార్టూనిస్టు, సమీక్షకుడు, విమర్శకుడు, కాలమిస్టు, పజిల్స్ నిర్మాత, వక్త.

**ముద్రిత గ్రంథాలు:**

* వీచికలు (కవితా సంకలనం) (ఇరివెంటి కృష్ణమూర్తి, చక్రవర్తి వేణుగోపాల్, వంగపల్లి విశ్వనాథంలతో కలసి యువభారతి ప్రచురణగా) 1967
* మేం (కవితా సంకలనం)
(మిత్రుడు డా॥ నాగినేని భాస్కరరావుతో కలిసి) 1974
* అగ్నిసుధ (కవితా సంకలనం) 1990
* సం.సా.రా.లు (సంస్కృతి–సాహిత్యం– రాజకీయాలు) (ఆంధ్రభూమి దినపత్రిక, ఎడిట్ పేజి మిడిల్ కాలమ్ వ్యాసాలు) 2001
* మనసు పావనగంగ (పాటలు) (ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ప్రసారమైన నలభై పాటలు) 2010.
* నవ్వుకుందాం, ఈసఫ్ నీతికథలు, పురాణ బాలలు, మన పండుగలు అనే పుస్తకాలు మానస ప్రచురణలు, విజయవాడ ప్రచురించినవి.
* ఇంకా కేంద్ర సాహిత్య అకాడమీ స్వాతంత్ర్యానంతర 'తెలుగు కవిత', 'తరం తరం', 'కవితా ఓ కవితా', విశాలాంధ్ర 'కవితా దశాబ్ది' విజయవాడ, వరంగల్ నుంచి వెలువడిన కొన్ని 'కవితా వార్షిక'ల వంటి పలు కవితా సంకలనాల్లో కవితల ప్రచురణ.
* 'మహతి', 'తెలుగు పసిడి', 'శ్రీశ్రీ ప్ర.జ', 'రావిశాస్త్రి రచనాసాగరం' వంటి సంకలనాల్లో, కె. శివారెడ్డి, దేవిప్రియ, ఇస్మాయిల్, శీలావీర్రాజు, రావూరు, మండలి, పి.వి. నరసింహారావు లపై వచ్చిన సంచికల్లో వ్యాసాలు, ఇంటర్వ్యూలు ప్రచురణ.

**అవార్డులు-సన్మానాలు:**

- ‘అగ్నిసుధ’ (కవితాసంకలనం) (1990) కు కలహంసి అవార్డు (హైదరాబాద్), ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు (ప్రొద్దుటూరు, కడప).
- ‘సం.సా.రా.లు’ గ్రంథానికి 2004లో తెలుగు విశ్వవిద్యాలయంచే ఉత్తమగ్రంథం (ఇతరాలు)గా సాహితీ పురస్కారం.
- ‘ఆరాధన’ సంస్థ – తొలి ఆకాశవాణి – టివి అవార్డుల్లో శ్రీమతి శారదా శ్రీనివాసన్ గారితో బాటుగా ఆకాశవాణి అవార్డు (1995)
- ‘మీడియా దంపతులు’గా శ్రీమతి ఉషారాణితో – కమలాకర్ ఛారిటబుల్ ట్రస్ట్ వారి ‘విశిష్ట దంపతుల పురస్కారం’ (1998)
- జ్యోత్స్న కళాపీఠం ఉగాది కవితా పురస్కారం (2002)
- ‘అభినందన’ సంస్థ వారిచే ఉత్తమ స్నేహితులుగా డా॥ కె.బి. లక్ష్మితో బాటుగా పురస్కారం (2003)
- ఆచార్య తిరుమల స్మారక సాహితీ పురస్కారం (2005)
- ఇంకా అఖిల భారత కర్ణాటక మహాసభలు (బళ్లారి), ఆంధ్రా కల్చరల్ అసోసియేషన్ (భువనేశ్వర్) వారిచే 2006లో గెస్ట్ ఆఫ్ ఆనర్ సత్కారం, కృష్ణాజిల్లా రచయితల సంఘం వారి అఖిల భారత తెలుగు రచయితల మహా సభల్లో కవి సత్కారం. (2007)
- ‘చేతన’ మాసపత్రిక వార్షికోత్సవ విశిష్ట పురస్కారం (2007)
- వంశీ ఇంటర్నేషనల్ ఉగాది పురస్కారం (2008)
- కీ॥శే॥ తురగా కృష్ణమోహన రావు స్మారక పురస్కారం (2008)
- విశాఖపట్నం ‘స్నేహసంధ్య’ వారిచే సత్కారం (2009)
- హిందీ ‘మిలాప్’ దినపత్రిక, శంకర్ మెమోరియల్ ట్రస్ట్ వారిచే అఖిల భారతీయ కవి సమ్మేళనంలో తెలుగు కవిగా సన్మానం (2009)
- ఇంకా పలు సంస్థలచే సన్మానాలు – పురస్కారాలు ఎన్నో....

**ప్రస్తుతం:**


* డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ అకడమిక్ కౌన్సిలర్. (ఎం.ఏ. తెలుగు సెకండ్ ఇయర్‌కు మాధ్యమాల రచన గురించి పాఠ్య బోధన)
* యువభారతి ప్రచురణల ప్రధాన సంపాదకుడు.
* కాలమిస్టుగా ఆంధ్రభూమి (దినపత్రిక) శుక్రవారాల్లో ఎడిట్‌పేజీ మిడిల్ కాలమ్‌గా సం.సా.రా.లు (సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు) రచన.
* ఆంధ్రప్రభ (దినపత్రిక)లో ప్రతిరోజూ 'పదనిసలు', ఆంధ్రజ్యోతి 'నవ్య' వారపత్రికలో 'పదగారడి', వార్త దినపత్రిక ఆదివారం అనుబంధంలో 'పదరంగం', ఆంధ్రభూమి మాసపత్రికలో 'పదమ వ్యూహం', రచన మాసపత్రికలో 'పజిలింగ్ పజిల్' గళ్లనుడికట్టుల నిర్వహణ.
* ఆంధ్రభూమి వారపత్రికలో 'సాహిత్య ప్రహేళిక', ఆంధ్రభూమి మాసపత్రికలో 'సంస్కృతీ ప్రహేళిక', చేతన మాసపత్రికలో 'వ్యంగ్య చేతన' శీర్షికల నిర్వహణ.
* ఈటీవి.2 తీర్థయాత్ర కార్యక్రమానికి అడపాదడపా స్క్రిప్ట్ రచన.
* ఈనాడు, ఆంధ్రభూమి, వార్త, నవ్య, ప్రజాశక్తి, పాలపిట్ట, సృజన ప్రియ వంటి వివిధ పత్రికల్లో పుస్తక సమీక్షలు, సాహితీ వ్యాసాలు మొదలైనవి.
* 'కౌముది' అంతర్జాల మాసపత్రికలో (www.kowmudi.net) "రేడియో జ్ఞాపకాలు" ధారావాహిక రచన. 'ఫేస్‌బుక్'లో 'ట్విట్టర్'లో సోషల్ నెట్‌వర్కింగ్.
* www.sudhamadhuram.blogspot.com లో 'సుధామధురం', 'తలుచుకునే తరుణాలు', http://www.kavisudhama.hpage.comలో 'అగ్ని 'సుధా'మ' అనే తెలుగు బ్లాగుల నిర్వహణ.
* పలుసాహిత్య సభలు - సమావేశాల్లో శ్రోత మొదలుకొని ముఖ్య అతిథి, అధ్యక్షుని వరకూ వివిధ హోదాల్లో పాల్గొనడం.
* చదువుకోవడం, వ్రాసుకోవడం, తినడం, తిరగడం, పడుకోవడం అంతే!...

*

# CHITRA GRANTHI
(Poetry in Telugu)

By

Sudhama
9849297958
sudhama60@yahoo.com
sudha.ma0@gmail.com



## సుధామ

కవిగా, రచయితగా, సమీక్షకునిగా, కార్టూనిస్టుగా కాలమిస్టుగా, పజిల్స్ నిర్మాతగా, వక్తగా, విశ్రాంత ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారిగా తెలుగు సాహిత్యలోకానికి పరిచితులు.

సుధామ, జి-12, సాదత్‌టవర్స్,
పద్మావతి అపార్ట్‌మెంట్స్,
సలీంనగర్‌కాలనీ, మలక్‌పేట
హైదరాబాద్-500 036 (ఆం.ప్ర.)